## ఎన్టీఆర్ అన్నా కాంటీన్లు... డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం



- ❍భావి తరాలకు డొక్కా సీతమ్మ దాతృత్వం తెలియాలి
- ❍మధ్యాహ్న భోజన పథకానికి అపర అన్నపూర్ణ పేరు సబబు
- ❍ప్రభుత్వం నిర్వహించే కాంటీన్లను ఎన్టీఆర్ గారి పేరుతో కొనసాగించాలి
- ❍ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రతిపాదన

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి ప్రారంభించే కాంటీన్లకు పేరు ఖరారు విషయంలో ఒక ఆసక్తికర చర్చ చోటు చేసుకొంది. వీటికి ఎన్టీఆర్ పేరుతో అన్నా కాంటీన్లు అని కొనసాగించాలా, డొక్కాసీతమ్మ పేరు కూడా జోడించాలా అనే చర్చ వచ్చింది. ఈ సందర్భంగా 2019 వరకూ ఉన్న విధంగా అన్నా కాంటీన్లు అని కొనసాగించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచించారు. అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ పేరు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి నిర్ణయించిన క్రమంలో కాంటీన్లకు ఎన్టీఆర్ పేరును కొనసాగించవచ్చని ప్రతిపాదనను ముందుకు తీసుకువెళ్లారు.

డొక్కా సీతమ్మ పేరుతో మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగిస్తే ప్రతి విద్యార్థికి సీతమ్మ గారి గొప్పదనం తెలుస్తుందని, పాఠశాల స్థాయిలో విశిష్ట వ్యక్తులు, దాతృత్వం కలిగినవారి పేర్ల మీద పథకాలు ఉండటం వల్ల భావితరాలకు మేలు కలుగుతుందని శ్రీ పవన్ కళ్యాణ్ గారు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా తాను పాఠశాల దశలో ఉండగా డొక్కాసీతమ్మ గురించి చదివిన విషయాన్ని జ్ఞప్తికి తెచ్చుకున్నారు. కంబాల కృష్ణమూర్తి రాసిన అమృత వాక్కులు అనే సంకలనాన్ని మా నాన్నగారు ఇచ్చారు. అందులో డొక్కాసీతమ్మ గారి దాన గుణాన్ని, ఆకలి అన్న వారికి అర్ధరాత్రి వేళ కూడా వండివార్చి పెట్టేవారనీ, అంతర్వేది దర్శనానికి బయలుదేరితే... దారిలో తన ఇంటికి భోజనానికి యాత్రికులు వస్తున్నారని తెలిసి దైవ దర్శనానికి వెళ్లకుండా వెనక్కివచ్చి ఆకలి తీర్చారని చదివాను. ఆ రోజు నుంచి డొక్కా సీతమ్మ గారి దాతృత్వ భావనలు గుర్తుకు వస్తూనే ఉంటాయని శ్రీ పవన్ కళ్యాణ్ గారు ప్రస్తావించారు.

స్కూలు విద్యార్థులకు భోజనం అందించే పథకానికి డొక్కా సీతమ్మ గారి పేరు ఉండటం వల్ల భావి తరాలకు విలువలు అందించగలమన్నారు. అలాగే పేదలకు కిలో రూ. 2 కు బియ్యం అందించే పథకం తీసుకువచ్చిన ఎన్టీఆర్ పేరుతో అన్నా కాంటీన్ల నిర్వహణ సముచితమన్నారు.

## లోకేష్ ఇలాకాలో సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ



- ❍రెండు గ్రామాలకు చెందిన వారికి సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ
- ❍మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపిన లబ్ధిదారులు

**మంగళగిరి రూరల్ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** అనారోగ్యంతో బాధపడుతూ ముఖ్యమంత్రి సహాయనిధికి పెదవడ్లపూడి, ఆత్మకూరు గ్రామాలకు చెందిన వారు ధరఖాస్తు చేసుకోగా రూ. 1,45,567 /- మంజూరు అయ్యాయి. ఆ చెక్కులను టీడీపీ నాయకులు బుధవారం అందజేశారు. మండల పార్టీ అధ్యక్షులు తోట పార్థసారథి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పెదవడ్లపూడి గ్రామానికి చెందిన డికొల్లు ఆనంద్ కుమార్‌కు రూ. 94,258/- వేలు, ఆత్మకూరు గ్రామానికి చెందిన మొసలి మహాలక్ష్మికి రూ. 51,309/- వేలు అందజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు రావడానికి కృషి చేసిన మంత్రి నారా లోకేష్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తోట పార్థసారథి మాట్లాడుతూ పేద ప్రజలను ఆదుకోవడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పుడు ముందుం టారని, ఇట్టి సదా అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ నాయకులు కొమ్మ సుకుమార్, జవ్వాది కిరణ్ చందు,యేళ్ళ శివరామయ్య, తాటి వెంకటరావు, మాదల రమేష్, తాతా కోటయ్య, చిట్టి బొమ్మ వెంకటేశ్వరరావు, మోతుకూరి రవికుమార్, శానం మాణిక్యాలరావు, వాసంశెట్టిసునీత, కటారి సాంబయ్య, జాలాది సందీప్, బొర్రా శ్రీకాంత్, రామకృష్ణ,గుర్రం బాగ్యరాజు, ఎండి కరిముల్లా, కట్టా దుర్గారావు, ఓంకార్, బాజీ తదితరులు పాల్గొన్నారు

# మన ‘ భూములు భద్రం ’

(మొదటి పేజీ తరువాయి)

**జీవో 40 రద్దు.. సున్నిపెంటకు కేటాయించిన 280 ఎకరాలు వెనక్కి..**

"జీవో నంబర్ 40 రద్దు కోసం జలవనరుల శాఖ చేసిన ప్రతిపాదనకు ఆమోదం లభించింది. మే 11, 2023న జారీ చేసిన జీవో 40 ప్రకారం నంద్యాల జిల్లా సున్నిపెంట గ్రామ పంచాయతీకి కేటాయించిన 280.74 ఎకరాల భూమిని రద్దు చేస్తూ.. దాన్ని తిరిగి నీటిపారుదల శాఖకు బదలాయించే ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదం. ఈ భూమిని అన్ని చట్టాలను పరిగణనలోకి తీసుకొని శ్రీశైలం దేవాలయాన్ని అభివృద్ధి చేసేందుకు రూపొందించిన మాస్టర్ ప్లాను వినియోగించుకోవాలని సూచన. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు తక్కువగా ఉండటంపై చర్చించాం. రాష్ట్ర భవిష్యత్తులో యువత జనాభా తగ్గిపోనుంది. ఎక్సైజ్ శాఖలో మెరుగైన విధానాలు ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ఇతర రాష్ట్రాల్లో ఉన్న విధానాలను అధ్యయనం చేయాలని నిర్ణయించాం" అని మంత్రి పార్థసారథి వివరించారు.

**మరికొన్ని నిర్ణయాలు...**

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సెక్యూరిటీ యాక్ట్ - 1992, సెక్షన్ 3 ప్రకారం (ఎ) కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్టు) మరియు రివల్యూషనరీ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఆర్.డి.ఎఫ్) సంస్థలపై ప్రస్తుతం ఉన్న నిషేధాన్ని మరో ఏడాది పాటు పొడిగించేందుకు చేసిన ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

వామపక్ష భావజాలం ప్రచారం చేస్తూ, ఘర్షణ వాతావరణానికి తెరతీయడం, రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలకి వ్యతిరేకంగా, ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులకు భంగం కలిగించడం, శాంతియుత వాతావరణానికి విఘాతం కల్గించడం, వ్యక్తులు మరియు పోలీసు సిబ్బంది హత్యలకు కారణమవుతున్న నేపథ్యంలో ఏ కేటగిరిలోని సంస్థలపై 17.8.2005 నుండి ఈ నిషేధం కొనసాగుతుంది. అదే విధంగా బి కేటగిరి లోని సంస్థలను చట్టవ్యతిరేక సంఘాలుగా గుర్తిస్తూ 9.8.2012 నుండి నిషేధం కొనసాగిస్తున్నారు.

పశు సంవర్ధక శాఖకు సంబంధించి తేదీ. 18.08.2021 నాడు జారీ చేసిన జి.ఓ.ఆర్టీ నంబర్ 217 మరియు మత్స్యశాఖకు సంబంధించి తేదీ. 08.09.2020 నాడు జారీ చేసిన జి.ఓ.ఆర్టీ సంఖ్య. 144 ల రద్దు కోసం చేసిన ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.





గత 3 దశాబ్దాలుగా మత్స్యకార సంపద, సంక్షేమం కోసం నామ మాత్రపు లీజుతో ప్రభుత్వ చెరువులను మత్స్యకార సహకార సంఘాలకు ఇచ్చారు. కానీ మత్స్యకారుల హక్కులకు భంగం కలిగించేలా జీవో నెంబర్ లు 144, 217 లను గత ప్రభుత్వం జారీ చేసింది. అందులో భాగంగా పైలట్ ప్రాజెక్ట్ క్రింద ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలో 25,380 హెక్టార్ల నీటి విస్తీర్ణంతో ఎంపిక చేసిన 27 ప్రభుత్వ చెరువులను 6592 మత్స్యకార కుటుంబాలకు చెందిన 27 మత్స్యకార సహకార సంఘాలకు కేటాయించకుండా పబ్లిక్ ఆక్షన్ వేయడం జరిగింది. ఇచ్చిన జీవోలను నిలుపుదల చేయాలని కోరుతూ ఇప్పటికే అనేక మంది మత్స్యకారులు, సంఘాలు 11 కోర్టు కేసులు ( 7 రిట్ పిటిషన్లు, 4 రిట్ అప్పీల్స్) వేసి న్యాయస్థానాలను ఆశ్రయించారు. దీంతో ఇచ్చిన జీవోలు అమలుకు సాధ్యం కాలేదు. అదే విధంగా సదరు జీవోలకు అనుగుణంగా "ఇన్ లాండ్ ఫిషర్ మేన్ కో ఆపరేటివ్ సొసైటీ"లను ఏర్పాటుపై ఎలాంటి స్పష్టత లేదు. తద్వారా మత్స్యకార సంఘాలకు చెరువులు కేటాయించని కారణంగా జీవనోపాధికి ఆటంకం ఏర్పడింది. మధ్యేమార్గంగా అక్రమార్కులు లబ్ధి పొందుతున్నారు. దీనికి చెక్ పెట్టేందుకు చేప పిల్లల పెంపకం నుండి మార్కెటింగ్ వరకు మధ్య దళారీ వ్యవస్థ లేకుండా మత్స్యకారుల కుటుంబాలకు లబ్ధి చేకూర్చేలా ఒక సమగ్రమైన యాక్షన్ ప్లాన్ రూపొందించాలని కేబినెట్ ముఖ్యమంత్రి సూచించారు. పర్యాటక అభివృద్ధి కోణంలో కూడా ఆలోచించాలని తద్వారా ఉపాధి, ఆర్థిక ప్రగతి కలుగుతాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మత్స్యకారుల ఆర్థిక పరిస్థితి, జీవన ప్రమాణాల పెంపు లక్ష్యంగా తరువాతి కేబినెట్ కు యాక్షన్ ప్లాన్ అందించాలని సూచించారు.

దీంతో సదరు 27 మత్స్యకార సంఘాలకు మేలు కలించాలని, పైన పేర్కొన్న 11 కేసులను పరిష్కరించాలనే సదుద్దేశ్యంతో సంబంధిత జీవోలను రద్దు చేయాలనే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలియజేసింది. తద్వారా రాష్ట్రంలోని లక్షలాది మత్స్యకారులకు మేలు జరుగుతుందని భావిస్తున్నాం.

ఇద్దరు పిల్లలకు మించి ఉన్నవారు మునిసిపల్ కార్పొరేషన్ మరియు మున్సిపాలిటీ ఎన్నికల్లో పోటీచేయడం మరియు సభ్యులుగా కొనసాగడాన్ని నిషేధిస్తూ ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్ చట్టం - 1955 మరియు ఆంధ్రప్రదేశ్ మున్సిపాల్టీస్ చట్టం 1965 లో చేసిన చట్ట సవరణల రద్దు కోసం చేసిన ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

తగ్గుతున్న పునరుత్పత్తి రేటును పరిగణలోకి తీసుకుంటూ మారుతున్న సామాజిక, ఆర్థిక అవసరాలను, జనాభా స్థిరీకరణ, జనాభా సమతౌల్యతను దృష్టిలో ఉంచుకొని సదరు నిబంధనలు ప్రస్తుత పరిస్థితులకు వర్తించనందున ఆ చట్టసవరణల రద్దుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

జాతీయ పునరుత్పత్తి రేటు 2.1 గా ఉంటే ఆంధ్రప్రదేశ్ లో అది కేవలం 1.5 గా ఉంది. ప్రస్తుత లెక్కల ప్రకారం మన రాష్ట్రంలో పురుషుల పునరుత్పత్తి వయసు సగటున 32.5 కాగా 2047 నాటికి 40 ఏళ్లుకానుంది. అదే విధంగా మహిళల్లో ప్రస్తుత పునరుత్పత్తి వయస్సు సగటున 29 సంవత్సరాలు కాగా అది 2047 నాటికి 38 సంవత్సరాలు కానుంది. ఆర్థికభివృద్ధికి దోహదపడే పనిచేసే వ్యక్తుల సంఖ్య గణనీయంగా తగ్గనుంది.

అదే విధంగా ప్రస్తుతం ఏపీలో 60 ఏళ్లకు పైబడిన వ్యక్తుల సంఖ్య 11 శాతం కాగా ఇది 2047 నాటికి 19 శాతం కానుంది. ఇదే వయస్సు జాతీయ స్థాయిలో ప్రస్తుతం 10 శాతంగా ఉండగా, 2047 నాటికి 15 శాతం కానుంది.

ఈ నేపథ్యంలో ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలున్న వారిని అర్బన్ లోకల్ బాడీస్ లో అనర్హులుగా ప్రకటిస్తూ 1955, 1965, 1994లో వచ్చిన ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ చట్టాలకు సవరణల ద్వారా కుటుంబ నియంత్రణ ప్రోత్సహించేలా జత చేసిన నిబంధనలను రద్దు చేసే ప్రతిపాదనలకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.

ఇద్దరు పిల్లలకు మించి ఉన్నవారు పంచాయతీ ఎన్నికల్లో పోటీచేయడం మరియు సభ్యులను అనర్హులుగా ప్రకటిస్తూ ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ చట్టం - 1994 లోని సెక్షన్ 19 కు చేసిన సవరణను రద్దు చేసేందుకు చేసిన ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

1980, 1990 దశకాల్లో జనాభా పెరుగుదల అధికంగా ఉన్న నేపథ్యంలో జనాభా నియంత్రణను అట్టడుగు స్థాయికి తీసుకువెళ్లాల్సిన పరిస్థితి. ఈ క్రమంలో గ్రామ పంచాయతీలు, మండల ప్రజా పరిషత్, జిల్లా ప్రజా పరిషత్ లలో పోటీ చేసే వాళ్లకు ఏపీ పంచాయతీరాజ్ చట్టం - 1994 లోని సెక్షన్ 19 ప్రకారం ఇద్దరు పిల్లలు చాలు అని చట్ట సవరణ చేయడం జరిగింది. కానీ ఈ చట్టంను 30 ఏళ్ల పాటు అమలు పరిచిన ప్రభుత్వం సంతానోత్పత్తి రేటు, పనిచేయగల సామర్థ్యం ఉన్న జనాభా గణనీయంగా తగ్గుతున్న నేపథ్యంలో పిల్లల సంఖ్య పై నిషేధం అనవసరమని భావిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రతిపాదన చేసిన ఈ సవరణకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

జీవో నెంబర్. 40 రద్దు కోసం జలవనరుల శాఖ చేసిన ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. తేదీ: 11.05.2023 నాడు జారీ చేసిన జీవో నెంబర్ 40 ప్రకారం నంద్యాల జిల్లా సుండిపెంట (శ్రీశైలం ప్రాజెక్టు) గ్రామ పంచాయతీకి కేటాయించిన భూమిని రద్దు చేస్తూ నీటిపారుదల శాఖకు బదిలాయించే ప్రతిపాదనను రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది. జలవనరుల శాఖకు బదిలీ చేసిన 208.74 ఎకరాల భూమిలో చేపట్టిన నిర్మాణాలను భవిష్యత్ అవసరాల దృష్ట్యా యథాతథంగా ఉంచాలని చేసిన ప్రతిపాదనను మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ తిరుపతి అధ్యాత్మిక క్షేత్రం తర్వాత రాష్ట్రంలో అత్యధికంగా టెంపుల్ టూరిజం, రెవెన్యూ ఉన్న దేవాలయం శ్రీశైలం అని, ఈ శ్రీశైలం ప్రాజెక్టు నీటి విడుదల సందర్భంగా అత్యధిక భక్తులు, పర్యాటకులు సుండిపెంట , శ్రీశైలం ప్రాజెక్టుకు, దేవాలయానికి వస్తున్న తరుణంలో ఆదాయం పెంచేందుకు, పర్యాటకాభివృద్ధికి ఈ స్థలాన్ని భవిష్యత్ లో బదలాయించాలని సూచించారు.

## జీవితాల్లో వెలుగులు నింపుతాం

- ❍చేనేత వస్త్రాలపై జీఎస్టీ రద్దుకు ప్రయత్నాలు
- ❍నెలలో ఒక రోజు చేనేత వస్త్రాలు ధరించి నేతన్నలను ప్రోత్సహిద్దాం
- ❍గత ప్రభుత్వం చేనేతలకు ఇచ్చే ప్రోత్సాహకాలన్నీ రద్దు చేసింది
- ❍ఫోటోలకు వందల కోట్లు తగలేసిన గత ప్రభుత్వం..చేనేతల సంక్షేమంపై దృష్టి పెట్టలేదు.
- ❍చేనేత కార్మికుల గృహాలకు సౌరవిద్యుత్ సదుపాయం కల్పిస్తాం
- ❍ఆగస్టు 15 నుండి మళ్లీ అన్న క్యాంటీన్లు
- ❍విజయవాడలో జాతీయ చేనేత దినోత్సవంలో సీఎం చంద్రబాబు

**విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** నెలలో ఒక రోజు అందరం చేనేత వస్త్రాలు ధరించి చేనేత కార్మికుల ప్రగతికి తోడ్పాటును అందిద్దామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు పిలుపునిచ్చారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా విజయవాడ మేరీస్ స్టెల్లా కళాశాలలో జరిగిన వేడుకల్లో సీఎం పాల్గొన్నారు. ఎగ్జిబిషన్ లో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల మాల్ ను సందర్శించారు. కార్మికుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చేనేత కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. 'టీడీపీ ఆవిర్భావం నుంచి అన్ని వేళలా చేనేతలు అండగా నిలిచారు. చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించడం నా బాధ్యత. మా ప్రభుత్వం చేనేత కార్మికులకు పూర్తి అండగా ఉంటుంది. నాడు స్వాతంత్ర్యోద్యమంలో స్వదేశీ వస్త్రాలను ప్రోత్సహించడం ఒక ఉద్యమంలా జరిగింది. అది అంతిమంగా క్విట్ ఇండియా ఉద్యమానికి దారితీసింది. 2015లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, నాడు సీఎంగా ఉన్న నేను చేనేత అంతర్జాతీయదినోత్సవానికి శ్రీకారం చుట్టాం. రాష్ట్రంలో చేనేత కార్మికులందరికీ ఒక భరోసా కల్పిండం కోసం నేను ఈ రోజు ఇక్కడికి వచ్చాను. గత ప్రభుత్వం నేతన్న నేస్తం అని చెప్పి నేత కార్మికుడికి రూ. 24 వేలు ఇచ్చేసి దాంతోనే అంతా బాగుపడిపోతారని అనుకున్నారు. మీకు రావాల్సిన అన్ని రకాల పథకాలను రద్దు చేశారు. ఆప్కో ద్వారా చేసే చేనేత వస్త్రాల కొనుగోళ్లు ఆపేశారు. నూలు, రంగులపై ఇచ్చే రాయితీలు తీసేశారు. అన్ని రకాల రుణాలు తీసేసి చేనేత కార్మికులు పొట్ట కొట్టారు. గత ప్రభుత్వం పోతూ పోతూ చేనేత రంగానికి, కార్మికులకు రూ. 266 కోట్లు అప్పు పెట్టి వెళ్లిపోయింది." అని సీఎం విమర్శించారు.

**రుణ మాఫీ చేసి ఆదుకున్నాం**

చరిత్ర ఒకసారి గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. టీడీపీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా చేనేత కార్మికుల కోసం అవిశ్రాంత పోరాటం చేసింద. 2007లో చేనేతలకు రూ. 372 కోట్ల రుణాలు మాఫీ చేయకుండా ఆనాటి ప్రభుత్వం మోసం చేస్తే పోరాడాం. మా తమ పోరాట ఫలితంగా 2009లో ముఖ్యమంత్రి రోశయ్య రూ. 109 కోట్లు రుణాలు మాఫీ చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే చేనేతలకు రూ. 110 కోట్లు రుణాలు మాఫీ చేసి చేనేతలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామన్నారు. 2014లో చేనేతలకు రూ. 250 కోట్లు బడ్జెట్ కేటాయించాం. 90,795 చేనేత కుటుంబాలకు వంద యూనిట్లు కరెంటు ఉచితంగా ఇచ్చాం. చేనేత కార్మికులకు చిన్న వయసులోనే అనారోగ్య సమస్యలు వస్తున్నాయని తెలిసి 50 ఏళ్లకే పింఛన్లు ఇచ్చిన ఘనత కూడా టీడీపీదే. నూలు, రంగులపైన సబ్సిడీ 20 శాతం ఉంటే దాన్ని 40 శాతానికి పెంచాం. మగ్గాలపై 50 శాతం రాయితీ ఇచ్చి రూ. 80 కోట్లు ఖర్చు చేశాం. 70 వేల మంది చేనేత కార్మికులకు మోటరైజ్డ్ జకార్డ్ లిఫ్టింగ్ సదుపాయం కల్పించామన్నారు. చేనేత పరిశ్రమ పట్ల, చేనేతల పట్ల మాకున్న శ్రద్ధకు ఇది నిదర్శనం చేనేతలకు ఇచ్చిన అన్ని హామీలు నిలబెట్టుకుంటాం" అని సీఎం స్పష్టం చేశారు.

**బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం**

రాష్ట్రంలో బీసీల రక్షణ కోసం ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకొస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. బీసీల్లో చాలా ఉప కులాలున్నాయని, వారంతా చాల వెనుకబడి ఉన్నారని, ఎక్కువ మంది కుల వృత్తులపైనే ఆధారపడి జీవిస్తున్నారని వారందర్నీ ఆదుకుంటామన్నారు. బీసీ సబ్ ప్లాన్ ద్వారా రూ. 1.50 లక్షల కోట్లు ఖర్చు చేస్తామని తెలిపారు. తద్వారా బీసీ జీవితాల్లో వెలుగులు నింపుతామన్నారు. స్థానిక సంస్థల్లో మళ్లీ బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు తీసుకొస్తామన్నారు. చట్టసభల్లో వెనుకబడిన వర్గాలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేలా అసెంబ్లీలో తీర్మానం చేస్తామని, ఇది పార్లమెంటులో చట్టమయ్యేంత వరకు బీసీల తరపున పోరాటం చేస్తామని తెలిపారు. నామినేటెడ్ పోస్టుల్లో కూడా బీసీలకు ప్రాధాన్యమిస్తామని చెప్పారు. టీడీపీ రాష్ట్ర పార్టీ అధ్యక్ష, అసెంబ్లీ స్పీకర్ ఇద్దరూ బీసీలేనని గుర్తు చేశారు.



**ఎక్కడ చూసినా విధ్వంసమే**

చేనేత దినోత్సవం సందర్భంగా చేనేతలకు ఎన్నో చెప్పాలని అనుకున్నానని, అడిగినదానికంటే ఎక్కువ ఇవ్వడం తన స్వభావమన్నారు. కానీ గత రెండు నెలలుగా ప్రభుత్వాన్ని చూస్తుంటే బాధేస్తోందని చెప్పారు. రాష్ట్ర ఖజానాను గత ప్రభుత్వం దివాలా తీయించిదన్నారు. రూ. 10లక్షల కోట్లు అప్పు పెట్టిందని, దానికి వడ్డీ, అసలు చెల్లించడానికే ప్రతి యేటా రూ. 80వేల కోట్లు కావాలన్నారు. ఎక్కడ చూసినా విధ్వంసం, వ్యవస్థలను సర్వనాశనం చేశారన్నారు. ప్రభుత్వంలో ఇప్పుడు చూస్తున్న ఇబ్బందులను తన అనుభవంలో ఎన్నడూ చూడలేదన్నారు. అయినా సరే ఇబ్బందులున్నాయని వెనకడుగు వేయబోయమన్నారు. సంపద సృష్టించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం తొలి రోజే 5 హామీల అమలుపై సంతకాలు చేశానని తెలిపారు. 65 లక్షల మందికి ప్రతి నెలా రూ. 2,737 కోట్లు పింఛన్లు చెల్లిస్తున్నామని, రాబోయే ఐదు ఏళ్లలో పింఛన్ల కిందే ప్రభుత్వం రూ. 1.65 లక్షల కోట్లు పంపిణీ చేయబోతోందన్నారు.

**త్వరలో చేనేత సహకార సంఘాల ఎన్నికలు**

'రాష్ట్రంలోని చేనేత సహకార సంఘాల పాలకమండళ్ల కాల పరిమితి ముగిసిపోతుందని, త్వరలోనే వాటికి ఎన్నికలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి అన్నారు. అయితే చేనేత రంగ అభివృద్ధి కోసం మేలు చేసేవారినే మీరు సభ్యులుగా ఎన్నుకోవాలని చేనేత కార్మికులకు సూచించారు. రాష్ట్రంలో 100 ఆప్కో షో రూములున్నాయని, గత ప్రభుత్వం పెట్టిన ఆప్కో బకాయిలు కూడా త్వరలో చెల్లిస్తామన్నారు. చేనేతల ప్రతి ఇంటికి సౌర విద్యుత్తు సదుపాయం కల్పిస్తామన్నారు. చేనేత కార్మికులకు పైసా ఖర్చు కాకుండా పీఎం సూర్య ఘర్ పథకం కింద ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తామన్నారు. అవసరాలకు పోను మిగిలిన విద్యుత్ ను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. అన్ని వేళలా తనకు పార్టీకి అండగా ఉన్న చేనేత కార్మికులు తన ఆత్మబంధువులన్నారు. చేనేత వస్త్రాలపై జీఎస్టీ భారంగా ఉందని, దాన్ని తొలగించాలని చేనేత కార్మికులు కోరుతున్నారని, కేంద్రం, జీఎస్టీ కౌన్సిల్ లో కూడా ఈ విషయాన్ని ప్రస్తావించి జీఎస్టీ తొలగించేలా చేస్తామన్నారు. ఒకవేళ కేంద్రం జీఎస్టీ తొలగించడానికి ముందుకు రాకపోతే చేనేతలు చెల్లించే జీఎస్టీ మొత్తాన్ని వాళ్లకు రాష్ట్ర ప్రభుత్వమే రియింబర్స్ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. చేనేత కార్మికులకు ఆరోగ్య బీమా చేయిస్తామని దానికి రూ. 10 కోట్లు అవసరమవుతుందని అధికారులు అంటున్నారని, ఈ కార్యక్రమం కూడా చేపడతామన్నారు. రాష్ట్రంలో 64 చేనేత క్లస్టర్ల అభివృద్ధికి సమగ్ర విధానం తీసుకొస్తామన్నారు. 92,724 మంది చేనేతలకు 50 ఏళ్లకే పింఛను అందిస్తున్నామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పుడు ఆలోచన తీరు మారుతోందని, ఒకప్పుడు అందరూ ఇండస్ట్రియల్ కాటన్ దుస్తులు ధరించేవారని, ఇప్పుడు ఖద్దరు, చేనేత దుస్తులు ధరించాలని ముందుకొస్తున్నారని దీన్ని మనం ఒక అవకాశంగా తీసుకుని సరైన డిజైన్లు రూపొందించి మన ప్రతిభ నిరూపించుకుని అధిక ఆదాయం పొందే స్థితికి చేరుకోవాలన్నారు. ఈ చేనేత పరిశ్రమకు చేయూతనిచ్చే బాధ్యత ప్రభుత్వానిదన్నారు.

# అమరావతి ... ఇక బంగారమే !

(మొదటి పేజీ తరువాయి)

పనులను టెండర్ ద్వారా దక్కించుకుంది..మొత్తం 23 వేల 429 ఎకరాల్లో జంగిల్ క్లియరెన్స్ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టింది.ఇవాళ ఉదయం 9 గంటలకు అమరావతిలోని ఎన్ 9 రహదారిని ఆనుకొని ప్రస్తుత సచివాలయం ఉన్న వెనుకవైపు జంగిల్ క్లియరెన్స్ పనులను ప్రారంభించారు..స్థానిక ఎమ్మెల్యే తాడికొండ శ్రావణ్ కుమార్ తో కలిసి ప్రత్యేక పూజలు అనంతరం స్వయంగా పొక్లెయిన్ ను ఆపరేట్ చేసి పనులను ఉత్సాహంగా ప్రారంభించారు మంత్రి నారాయణ..ఆ తర్వాత మీడియాతో మాట్లాడారు మంత్రి.

అమరావతికి ఇవాళ శుభోదయం..2014-19 మధ్య కాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మీద నమ్మకంతో అమరావతి కోసం కేవలం 38 రోజుల్లోనే 34 వేల ఎకరాల భూమిని ల్యాండ్ పూలింగ్ ద్వారా రైతులు ప్రభుత్వానికి ఇచ్చారు..ల్యాండ్ పూలింగ్ ద్వారా సమీకరించిన భూమిలో మాస్టర్ ప్లాన్ ద్వారా రోడ్లు,భవనాలు,ఇతర మౌలిక వసతులు కల్పించేందుకు 41,484 కోట్లతో పనులు చేపట్టినట్లు మంత్రి నారాయణ తెలిపారు.అయితే గత వైసీపీ ప్రభుత్వం మూడు ముక్కలాట ఆడి విశాఖపట్నం,కర్నూలు,అమరావతి అంటూ రైతులను ఇబ్బంది పెట్టింది...గత ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టినప్పటికీ ఎంతో ధైర్యంతో ఉన్న అమరావతి రైతులను అభినందిస్తున్నట్లు మంత్రి తెలిపారు.మొత్తం 58 వేల ఎకరాలు అమరావతి పరిధిలో ఉండగా 24 వేల ఎకరాల్లో దట్టమైన అడవిలా పిచ్చి మొక్కలు పెరిగిపోయాయన్నారు...వెంటనే కంపలు తొలగించాలన్న సీఎం ఆదేశాలతో పనులు ప్రారంభించామన్నారు మంత్రి...30 రోజుల్లోగా పనులు పూర్తి చేసేలా టెండర్ల ప్రక్రియ పూర్తిచేసామన్నారు...అమరావతి పనులకు ఇది మొదటి అడుగు అన్నారు...జంగిల్ క్లియరెన్స్ పూర్తయితే రైతులు తమకు వచ్చిన రిటర్నబుల్ ప్లాట్ లు ఎక్కడ ఉన్నాయో చూసుకునే అవకాశం ఉంటుందన్నారు...అమరావతి కి జరిగిన అన్యాయంతో రైతులు ఇబ్బందులను గుర్తించి వారికి మరో ఐదేళ్ల పాటు కౌలు గడువు పొడిగించామన్నారు మంత్రి.భూమి లేని నిరుపేదలకు కూడా మరో ఐదేళ్లు పెన్షన్ కొనసాగించేలా నిర్ణయం తీసుకున్నామన్నారు..అమరావతి నిర్మాణం ద్వారా రైతుల భూముల విలువ పెరిగేలా చేస్తామని చెప్పారు మంత్రి నారాయణ.

**త్వరలో ఐఐటీ నిపుణుల ప్రాథమిక నివేదిక**

గడిచిన ఐదేళ్లుగా అసంపూర్తిగా ఉన్న భవనాల నిర్మాణాలను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో వాటి సామర్ధ్యంపై అధ్యయనం చేస్తున్నామన్నారు మంత్రి..ఇప్పటికే ఐఐటీ హైదరాబాద్,ఐఐటీ మద్రాస్ నుంచి ఇంజినీరింగ్ నిపుణులు అమరావతిలో పర్యటించి గతంలో నిలిచిపోయిన భవనాల నిర్మాణాలను పరిశీలించినట్లు తెలిపారు..త్వరలో ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి అందిస్తారని...దానికనుగుణంగా నిర్మాణాల విషయంలో నిర్ణయం తీసుకుంటామని మంత్రి నారాయణ చెప్పారు.

అమరావతి నాశనంతో ప్రజలపై జగన్ భారం వేసారు..ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్

అమరావతి జంగిల్ క్లియరెన్స్ పనుల ప్రారంభంలో మంత్రి నారాయణతో పాటు స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు..అమరావతి రైతులకు ఈరోజు ఎంతో సంతోషకరమైన రోజన్నారు ఎమ్మెల్యే..గత ఐదేళ్లలో అమరావతి ప్రాంత ప్రజలపై కోపంతో రైతులను వైసీపీ ప్రభుత్వం ఇబ్బందులు పెట్టిందన్నారు..అమరావతిని నాశనం చేయడంతో పాటు ముళ్లకంపలు పెరిగిపోవడంతో వాటిని తొలగించేందుకు కోట్ల రూపాయిలు ఖర్చవుతుందన్నారు..అమరావతి నిర్మాణం కోసం తీసుకొచ్చిన మెటీరియల్ కూడా పాడైపోయిందన్నారు ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దిన పత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి
జన్మదిన శుభాకాంక్షలు, పొలిటికల్, స్వదేశాగమనం, లీగల్ ప్రకటనలు, క్లాసిఫైడ్స్
పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, సినిమా, వివాహ మహోత్సవం,
షష్టిపూర్తి మహోత్సవం మరియు అన్ని శుభకార్యాలు
ప్రకటనల విభాగం
76 61 80 59 68


# జాతీయం/అంతర్జాతీయం

## తొమ్మిదో రోజు కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్స్



**వయనాడ్ (జర్నలిస్ట్ ఫైల్):** వయనాడ్ మెప్పాడి సమీపంలో కొండచరియలు విరిగిపడి వందలాది మంది మృతి చెందారు. ఇప్పటికీ రెస్క్యూ ఆపరేషన్స్ కొనసాగుతున్నాయి. వరుసగా అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. 'కొండచరియలు విరిగినపడిన ప్రాంతంలో ఐఏఎఫ్, ఐఎ, రాష్ట్ర అధికారులు సంయుక్తంగా రెస్క్యూ ఆపరేషన్‌లు నిర్వహిస్తున్నారు. సైన్యంతోపాటు ప్రత్యేక సైనికుల బృందాన్ని విమానంలో కల్పెట నుండి చలియార్ నదికి నది వద్దకు పంపించినట్లు పిఆర్ఓ డిఫెన్స్ కొచ్చి సామాజిక మాధ్యమం ఎక్స్ పోస్టులో పేర్కొంది. కాగా ఆరుగురు ఆర్మీ సిబ్బంది, స్పెషల్ ఆపరేషన్ గ్రూప్ (ఎస్ఓజి)కి చెందిన నలుగురు, ఇద్దరు ఫారెస్ట్ అధికారులు, ఒక డాగ్ స్క్వాడ్‌తో కూడిన ప్రత్యేక బృందం వయనాడ్‌లోని సూజిప్పర జలపాతాల సన్‌రైజ్ వ్యాలీ వద్దకు సెర్చ్ ఆపరేషన్‌కు బయలుదేరింది.

## ఢిల్లీ కోచింగ్ సెంటర్ మరణాలపై విచారణ చేపట్టిన సిబిఐ




**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్):** దేశ రాజధాని ఢిల్లీలో ఓల్డ్ రాజిందర్ నగర్‌లోని రావూస్ కోచింగ్ సెంటర్‌లో వరదనీరు పోటెత్తడంతో ముగ్గురు విద్యార్థులు మృతి చెందిన సంగతి తెలిసిందే. మృతి చెందిన వారు ఉత్తరప్రదేశ్‌కు చెందిన శ్రేయా యాదవ్ (25), తెలంగాణకు చెందిన తాన్యా సోని (25), కేరళకు చెందిన నెవిన్ డెల్విన్ (24)లుగా అధికారులు గుర్తించారు. ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు ఈ కేసును ఢిల్లీ పోలీసుల నుంచి సిబిఐ స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టిందని అధికారులు బుధవారం వెల్లడించారు.

కాగా, బేస్‌మెంట్ నుండి వరద పోటెత్తినప్పుడు విద్యార్థులు ఎలా బయటకు రాలేకపోయారు? ఆ సమయంలో తలుపులు మూసుకుపోయాయా? లేక మెట్లు ఇరుకుగా ఉన్నాయా? బేస్‌మెంట్‌లోకి వరద వెంటనే రాదు. బేస్‌మెంట్ నిండా నీరు చేరడానికి కనీసం రెండు లేదా మూడు నిమిషాల సమయం పడుతుంది. కానీ కేవలం ఒక్క నిమిషంలోనే వరదనీరు పోటెత్తడం ఎలా సాధ్యం? అనే విషయాలను తెలుసుకోవాలని హైకోర్టు సిబిఐని కోరింది. అలాగే ఈ కేసులో సిబిఐ దర్యాప్తును పర్యవేక్షించేందుకు ఓ సినియర్ అధికారిని నామినేట్ చేయాలని సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సివిసి)ని హైకోర్టు కోరింది.

## వినేశ్ ఫొగట్ అస్వస్థత



**(జర్నలిస్ట్ ఫైల్):** పారిస్ ఒలింపిక్స్‌లో భారత రెజ్లర్ వినేశ్ ఫొగట్ అస్వస్థతకు గురైంది. డిహైడ్రేషన్ తో బాధపడుతున్న ఆమెను పారిస్ లోని ఆసుప్రతికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కేజీ బరువు తగ్గేందుకు తీవ్రమైన కసరత్తులు చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. రాత్రంతా వర్కౌట్ చేసిన ఆమె.. స్కిప్పింగ్, సైక్లింగ్, జాగింగ్‌తో వినేశ్ ఫొగట్ బిజీగా గడిపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో డీ హైడ్రేషన్‌కు గురైన వినేశ్ ఫొగట్‌ను భారత అధికారులు సమీప ఆస్పత్రికి తరలించినట్లు తెలుస్తోంది.

పారిస్ ఒలింపిక్స్‌లోభారత రెజ్లర్ వినేశ్ ఫొగట్ మహిళల 50 కేజీల కేటగిరీలో ఫైనల్‌కు దూసుకెళ్లింది. కానీ 50 కేజీల విభాగంలో పోటీ చేస్తున్న ఆమె 100 గ్రాములు అధిక భరువు ఉండటంతో అనర్హురాలిగా ప్రకటించారు. దీంతో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ తీసుకున్న నిర్ణయంపై సవాల్ చేసేందుకు ఐఓఏ సిద్ధమైంది.

## 100 గ్రాములు ఎక్కువున్నా.. అనుమతిస్తారు: వినేశ్ ఫొగాట్ పెద్దనాన్న మహవీర్



**ఇంటర్నెట్ డెస్క్ (జర్నలిస్ట్ ఫైల్):** పారిస్ ఒలింపిక్స్ రెజ్లింగ్‌లో ఫైనల్‌కు చేరిన వినేశ్ ఫొగాట్‌పై అనూహ్యంగా అనర్హత వేటు పడింది. వంద గ్రాముల అధిక బరువు ఉండడం వల్ల ఒలింపిక్ కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. దీనిపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ఈ క్రమంలో వినేశ్ పెద్ద నాన్న మహవీర్ స్పందించారు. "బంగారు పతకం కోసం దేశమంతా ఎదురు చూసింది. ఎవరైనా రెజ్లర్ 50-100 గ్రాముల బరువు ఎక్కువగా ఉన్నా ఆడటానికి అనుమ తిస్తారు. అయితే, అక్కడ రూల్స్ మాత్రం అలా ఉండటంతో వేటు పడింది. దేశ ప్రజలెవరూ నిరాశ చెందొద్దని కోరుతున్నా. ఆమె ఏదొక రోజు దేశం కోసం తప్పకుండా పతకం సాధిస్తుంది. ఆమెను తదుపరి ఒలింపిక్స్ కోసం సన్నద్ధం చేస్తా" అని వెల్లడించారు. మహవీర్ స్పందించినట్లుగానే ఒలింపిక్ పతక విజేత విజేందర్ సింగ్ కూడా కీలక వ్యాఖ్యలు చేశాడు. "ఒకవేళ అథ్లెట్ కాస్త అధిక బరువు ఉంటే.. స్టీమ్ బాత్, రన్నింగ్, డైట్ వల్ల దానిని తగ్గించవచ్చు. కానీ, ఫైనల్‌కు ముందు కేవలం 100 గ్రాముల బరువు ఉన్నట్లు చెబుతూ అనర్హత వేటు వేయడం సరైంది కాదు. బరువు తగ్గించుకోవడానికి బాక్సర్లకు గంటకుపైగా సమయం ఇస్తారు" అని విజేందర్ పేర్కొన్నాడు. 50 కేజీల విభాగంలో వినేశ్ ఫొగాట్ బరిలోకి దిగిన విషయం తెలిసిందే. రెజ్లర్లను బరువు తూచే సమయంలో వారికి 30 నిమిషాల వ్యవధి ఇస్తారు. ఈ వ్యవధిలో వారు ఎన్నిసార్లైనా తమ బరువును కొలుచుకోవచ్చు.

## జగన్‌మోహన్‌రెడ్డి అక్రమాస్తుల కేసులో సుప్రీంకోర్టు సీరియస్



**ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్):** ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసులో సుప్రీంకోర్టు సీరియస్ అయ్యింది. సీబీఐ దాఖలు చేసిన అఫిడవిట్‌లోని అంశాలు షాకింగ్ కలిగిస్తున్నాయని జస్టిస్ సంజీవ్ ఖన్నా పేర్కొన్నారు. ఉండి ఎమ్మెల్యే, మాజీ ఎంపీ రఘురామకృష్ణంరాజు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. సీబీఐ దాఖలు చేసిన అఫిడవిట్‌లోని అంశాలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయని జస్టిస్ సంజీవ్ ఖన్నా అన్నారు. కేసులు ట్రయల్ ప్రారంభం కాకుండానే ఇన్ని కేసులు ఎలా ఫైల్ చేశారంటూ సీబీఐని న్యాయమూర్తి ప్రశ్నించారు. కేసులు నమోదు అయిన నాటి నుంచి ఆరుగురు జడ్జిలు మారిపోయారని, రిటైర్ అయ్యారని, గత పదేళ్లుగా కాలయాపన చేస్తున్నారంటూ రఘురామ తరఫు న్యాయవాది ధర్మాసనానికి తెలిపారు. దీనికి జస్టిస్ సంజీవ్ ఖన్నా అసహనం వ్యక్తం చేశారు. ఒక కోర్టు ఇచ్చిన ఆదేశాలు తప్పంటూ మరో కోర్టుకు ఆ కోర్టు ఇచ్చిన ఆదేశాలు కూడా తప్పంటూ మరో కోర్టుకు వెళ్తూ కాలయాపన చేస్తున్నారని ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టుల ఉత్తర్వులు తప్పు అని చేస్తున్న వ్యవహారానికి ట్రయల్‌కి సంబంధం లేదని జస్టిస్ ఖన్నా వ్యాఖ్యానించారు. జగన్ అక్రమాస్తుల కేసు విచారణను వేగవంతం చేయాలని, విచారణ తెలంగాణ నుంచి మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని రఘురామ తరఫు న్యాయవాది కోరారు. తెలంగాణ నుంచి డిశ్చార్జ్ పిటిషన్లు వేస్తున్నారని, కోర్టు సాధారణ కార్యకలాపాలకు ఇది అడ్డంకిగా మారుతోందని రఘురామ తరఫు న్యాయవాది ధర్మాసనం ఎదుట చెప్పారు. సీబీఐ తరఫు వాదనలు వినిపించడానికి ఎ.ఎస్.జి.రాజు అందుబాటులో లేరని ఇతర న్యాయవాదులు ధర్మాసనానికి తెలిపారు.

## వెంటపడ్డ ఆకతాయిలు.. రైలెక్కి 140 కి.మీ. వెళ్లిన అమ్మాయిలు



**ఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్):** ఉత్తర్‌ప్రదేశ్‌లో ఆకతాయి కుర్రాళ్ల నుంచి తప్పించుకునేందుకు గూడ్స్ రైలు ఎక్కి 140 కి.మీ.లు ప్రయాణించిన ఇద్దరు అమ్మాయిలను ట్రెయిన్ గార్డు రవినీత్ ఆర్య కాపాడారు. ఆగస్టు 3వ తేదీన ఈ ఘటన జరిగింది. హాథ్రాస్ నుంచి బయలుదేరిన రైలు రాత్రి 11.00 గంటలకు ఇటావాలో ఆగింది. సంతకం చేసేందుకు స్టేషనులోకి వెళ్లబోయిన ఆర్య ప్లాట్‌ఫాం మీద కూర్చొని భయంభయంగా దిక్కులు చూస్తున్న ఇద్దరు బాలికలను గమనించారు. వివరాలు ఆరా తీయగా.. బాలికలు కన్నీటిపర్యంతం అవుతూ జరిగిన ఉదంతాన్ని వివరించారు. హాథ్రాస్‌కు చెందిన ఈ బాలికలు చీకటిపడ్డాక ట్యూషను నుంచి తిరిగివస్తుండగా కుర్రాళ్లు వెంటపడ్డారు. వారి నుంచి తప్పించుకునేందుకు పరుగు తీసి మార్గమధ్యంలోని రైల్వేస్టేషనులో ఆగి ఉన్న గూడ్సు బండెక్కి నక్కి కూర్చొన్నారు. ఇంతలో రైలు కదిలిపోయింది. అలా 140 కి.మీ.లు రైలు ప్రయాణించింది. చుట్టూ చీకటి.. చేతిలో ఉన్న సెల్‌ఫోనుతో ఇంట్లోవాళ్లకు సమాచారం ఇచ్చారు. ఎక్కడ ఉన్నారో.. ఎటు వెళుతున్నారో మాత్రం చెప్పలేకపోయారు. ఈ విషయం ఆర్య స్టేషను సూపరింటెండెంటు దృష్టికి తీసుకువెళ్లడంతో బాలికల కుటుంబాలతో మాట్లాడి సురక్షితంగా ఇళ్లకు పంపే ఏర్పాట్లు చేశారు.

## బంగ్లాదేశ్ బ్యాంక్ డిప్యూటీ గవర్నర్ సహా ఆరుగురు రాజీనామా





**ఢాకా (జర్నలిస్ట్ ఫైల్):** దేశంలో అనిశ్చితి నెలకొనడంతో బంగ్లాదేశ్ బ్యాంక్ డిప్యూటీ గవర్నర్ ఖాజీ సయేదుర్ రెహమాన్ సహా ఆరుగురు ఉన్నతాధికారులు బుధవారం రాజీనామా చేశారు. హింసాత్మక పరిస్థితుల అనంతరం దేశవ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలన్నీ తిరిగి తెరుచుకున్న రెండో రోజు ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనల్లో పలువురు బ్యాంకు ఉద్యోగులు కూడా పాల్గొన్నారు.

డిప్యూటీ గవర్నర్ రెహమాన్ గదికి చేరుకున్న ఆందోళనకారులు ఆయన రాజీనామా చేయాలని ఒత్తిడి చేసినట్లు ప్రత్యక్షసాక్షులు తెలిపారు. దీంతో ఆయన రాజీనామా పత్రంపై సంతకం చేసి బ్యాంకు నుండి బయటకు వచ్చినట్లు చెప్పారు. ఆగ్రహించిన అధికారులు డిప్యూటీ గవర్నర్లు నూరున్ నహర్, ఎండి ఖుర్షీద్ ఆలం, ఎండి హబీబుర్ రెహమాన్‌లను ఖాళీ కాగితాలపై సంతకం చేయమని ఒత్తిడి చేశారు. అనంతరం బ్యాంక్ సలహాదారు అబు ఫరా నాసర్ మరియు బంగ్లాదేశ్ ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ (బిఎఫ్ఐయు) హెడ్ మసూద్ బిస్వాస్‌లను కూడా రాజీనామా చేయాలని ఒత్తిడి చేశారు.

వీరంతా కాంట్రాక్ట్ ప్రాతిపదికన బంగ్లాదేశ్ బ్యాంకులో నియమితులయ్యారు. ఆందోళన చేస్తున్న అధికారులు వారిని సెంట్రల్ బ్యాంకులో అనర్హమైన వ్యక్తులుగా ప్రకటించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జాకీర్ హుస్సేన్ చౌదరిని బ్యాంక్ బాధ్యత అధికారిగా నియమించారు.

తనను ప్రభుత్వం నియమించిందని, ప్రభుత్వం ఆదేశిస్తే తాను రాజీనామా చేస్తానని, లేదా తొలగించినా ఆమోదమేనని డిప్యూటీ గవర్నర్ కాజీ సయేదుర్ రెహమాన్ పేర్కొన్నారు. కానీ ఈ విధంగా రాజీనామా చేయాలంటూ ప్రభుత్వ ఉద్యోగులు ఒత్తిడి చేయడం సమంజసం కాదని అన్నారు. షేక్ హసీనా సోమవారం దేశాన్ని విడిచి వెళ్లిన తర్వాత మరో గవర్నర్ అబ్దుర్ రూఫ్ తాలూక్దర్ బ్యాంకుకు హాజరుకాలేదు. నియంత హసీనాకు స్నేహితులుగా ఉన్నవారంతా రాజీనామా చేయాల్సిం దేనని బుధవారం సెంట్రల్ బ్యాంక్ అధికారులు డిమాండ్ చేశారు.

## వినేశ్‌పై అనర్హత వేటు.. పీటీ ఉష ఏమన్నారంటే..!



ఇంటర్నెట్‌డెస్క్(జర్నలిస్ట్ ఫైల్): పారిస్ ఒలింపిక్స్ లో తుది అంకానికి చేరువై.. అనూహ్యంగా అనర్హతకు గురైంది స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ పతక రేసులో ఉన్న ఆమె వైదొలగడం ప్రతి ఒక్కరిని షాక్‌కు గురిచేసింది. దీనిపై భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష స్పందించారు. కొద్దిసేపటి క్రితమే ఒలింపిక్ క్రీడాగ్రామంలోని పాలీక్లినిక్‌లో వినేశ్‌ను కలిశాను. భారత ఒలింపిక్ సంఘం, భారత ప్రభుత్వం, దేశం మొత్తం ఆమెకు అండగా ఉందని హామీ ఇచ్చాను. వినేశ్‌కు వైద్యపరంగా, భావోద్వేగపరంగా సాయం అందిస్తున్నాం. అనర్హత వేటు విషయాన్ని రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా.. 'యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్' దృష్టికి తీసుకెళ్లింది. వినేశ్‌ను ఫైనల్స్‌కు సిద్ధం చేసేందుకు ఆమె వైద్య బృందం అవిశ్రాంత ప్రయత్నం చేసింది" అని పీటీ ఉష వెల్లడించారు.

ఈఅనర్హత వేటుపై కేంద్ర క్రీడాశాఖా మంత్రి మన్‌సుఖ్ మాండవీయ లోక్‌సభలో ప్రకటన చేశారు. వందగ్రాముల అధిక బరువు కారణంగా అనర్హతకు గురికావడంతో రెజ్లింగ్ 50 కేజీల విభాగం ఫైనల్ నుంచి వైదొలగాల్సి వచ్చిందని మాండవీయ వెల్లడించారు. ఈ వ్యవహారంపై 'యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్' వద్ద భారత ఒలింపిక్ సంఘం తీవ్ర నిరసన వ్యక్తం చేసినట్లు తెలిపారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉషను ప్రధాని మోదీ ఆదేశించిన విషయం తెలిసిందే.

## జాతీయ విపత్తుగా ప్రకటించాలి : రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్):** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్నాయి. వయనాడ్ కొండచరియలు విరిగిపడిన ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్రాన్ని కోరారు. నష్టపరిహారాన్ని పెంచాలని పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. అందరూ ఐక్యంగా సాయం అందించేందుకు ముందుకు వచ్చారని అన్నారు. కొండచరియలు విరిగిపడటంతో కీలకమైన రోడ్లు తెగిపోయాయి. సహాయక బృందాలు ఆయా ప్రాంతాలకు చేరుకోవడం అసాధ్యం. ఇది పెను విషాదమని అన్నారు. మౌలికసదుపాయాలు, బాధితులకు సాయం అందించేందుకు వయనాడ్‌కు సమగ్ర పునరావాస ప్యాకేజీ ఇవ్వాలని

## అటార్నీ జనరల్ ఏఎం అమీన్ ఉద్దిన్ రాజీనామా



**ఢాకా (జర్నలిస్ట్ ఫైల్):** బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్ల వ్యతిరేక ఆందోళనల నేపథ్యంలో ఆ దేశ ప్రధాని షేక్ హసీనా తన పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే అటార్నీ జనరల్ అడ్వకేట్ అబు మహ్మద్ అమీన్ ఉద్దీన్ బుధవారం తన పదవికి రాజీనామా చేశారు. ఈయనను అక్టోబర్ 2020లో న్యాయ మంత్రిత్వ శాఖ అటార్నీ జనరల్‌గా నియమించింది. ఈయన బంగ్లాదేశ్ 16వ అటార్నీ జనరల్‌గా పనిచేశారు. 2020లో అటార్నీ జనరల్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న మహబూబే ఆలం కోవిడ్ కారణంగా సెప్టెంబర్ 27న మృతి చెందారు. దీంతో ఆయన స్థానంలో అమీన్ ఉద్దీన్‌ను న్యాయమంత్రిత్వశాఖ నియమించింది. కాగా, అమీన్ ఉద్దీన్ గతంలో సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, కార్యదర్శిగా కూడా పనిచేశారు. 34.

## క్రియాశీలకంగా భారత హైకమిషన్



**ఢాకా (జర్నలిస్ట్ ఫైల్):** బంగ్లాదేశ్‌లోని భారత హైకమిషన్ క్రియాశీలకంగా ఉన్నట్లు అధికారిక వర్గాలు బుధవారం ఓ ప్రకటనలో తెలిపాయి. హైకమిషన్‌లోని భారతీయ దౌత్యవేత్తలందరూ విధులు నిర్వహిస్తున్నారని, హైకమిషన్ కార్యాలయం పనిచేస్తోందని పేర్కొన్నాయి. అత్యవసరం కాని సిబ్బంది, వారి కుటుంబసభ్యులు స్వచ్ఛంద ప్రాతిపదికన వాణిజ్య విమానంలో బుధవారం తిరిగి వచ్చారని పేర్కొన్నాయి. దేశంలోని పలు ప్రాంతాల్లో ఘర్షణలు కొనసాగుతున్నందున అత్యవసరం కాని సిబ్బంది భారత్‌కు చేరుకుంటున్నారని వెల్లడించాయి.

ఆ దేశంలో ఉన్న భారతీయు గురించి సమాచారం తెలుసుకునేందుకు హై కమిషన్ ఆఫ్ ఇండియా ఎమర్జెన్సీ నెంబర్‌లను ప్రకటించింది.

హై కమిషన్ ఆఫ్ ఇండియా (హెచ్‌సిఐ), ఢాకా
880-1937400591
అసిస్టెంట్ హెచ్‌సిఐ , చిట్టిగాంగ్
880-1814654797
880-1814654799
అసిస్టెంట్ హెచ్‌సిఐ, రాజాషాహి
880-1788148696
అసిస్టెంట్ హెచ్‌సిఐ, సిల్హెట్
880-1313076411
అసిస్టెంట్ హెచ్‌సిఐ, ఖుల్నా
880-1812817799

# తెలంగాణా వార్తలు

## తెలంగాణలో మూడు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు కసరత్తు




**హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్):** తెలంగాణలో ఖాళీ అవనున్న మూడు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు ఈసీ కసరత్తు చేస్తోంది. వచ్చే ఏడాది మార్చి 29తో కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ, ఇవే జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల టీచర్స్ నియోజకవర్గ ఎమ్మెల్సీల పదవీకాలం ముగియనుంది. సెప్టెంబర్ నుంచి ఓటరు జాబితా దరఖాస్తులు స్వీకరిస్తారు. డిసెంబర్ 30న తుది జాబితా విడుదల చేస్తారు. ఫిబ్రవరిలో ఎన్నికల షెడ్యూల్, మార్చిలో ఎన్నికలు జరిగేందుకు అవకాశం ఉంది.

## వయనాడ్ విషాదం.. ప్రభాస్ భూరి విరాళం



**హైదరాబాద్(జర్నలిస్ట్ ఫైల్):** కష్టాల్లో ఉన్నవారికి చేయూత అందించడానికి ఎప్పుడూ ముందుంటారు నటుడు ప్రభాస్ తాజాగా ఆయన మరోసారి తన గొప్ప మనసును చాటుకున్నారు. కేరళలోని వయనాడ్ జిల్లాలో చోటుచేసుకున్న విషాదాన్ని దృష్టిలో ఉంచుకుని తాజాగా ఆయన భూరి విరాళాన్ని ప్రకటించారు. ఈమేరకు కేరళ సీఎం రిలీఫ్ ఫండ్‌కు ప్రభాస్ రూ. 2 కోట్లు విరాళం ఇస్తున్నట్లు ఆయన టీమ్ తెలిపింది. దీనిపై సినీ ప్రియులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. టాలీవుడ్ నుంచి అంత మొత్తంలో విరాళాన్ని చెల్లించిన హీరో ఆయనే కావడం విశేషమని నెటిజన్లు అనుకుంటున్నారు. ఆయన గొప్ప మనసుని మెచ్చుకుంటున్నారు. కేరళలోని వయనాడ్ జిల్లాలో కొండచరియలు విరిగిపడి వందలాది మంది ప్రాణాలు కోల్పోయిన ఘటన అందరినీ కలచివేస్తోంది. సహాయక చర్యల కోసం పలువురు సినీతారలు ముందుకొచ్చి ఆపన్న హస్తం అందిస్తున్నారు. ఆ విషాద ఘటనపై స్పందించిన చిరంజీవి, రామ్‌చరణ్ రూ.కోటి విరాళంగా ప్రకటించారు. అల్లు అర్జున్ రూ. 25 లక్షలు కేరళ సీఎం సహాయ నిధికి అందిస్తున్నట్లు తెలిపారు. హీరో సూర్య, ఆయన భార్య జ్యోతిక, సోదరుడు కార్తి సంయుక్తంగా రూ. 50 లక్షలు, నయనతార - విఘ్నేశ్ శివన్ దంపతులు రూ. 20 లక్షలు మలయాళ నటులు మమ్ముట్టి, ఆయన తనయుడు దుల్కర్ సల్మాన్ కలిపి రూ. 35 లక్షలు, ఫహాద్ ఫాజిల్ రూ. 25 లక్షలు, కమల్ హాసన్ రూ. 25 లక్షలు, విక్రమ్ రూ. 20 లక్షలు, రష్మిక రూ. 10 లక్షల విరాళం ప్రకటించారు.

మరోవైపు నటుడు మోహన్‌లాల్ స్వయంగా సహాయక చర్యల్లో పాల్గొన్నారు. తాను వ్యవస్థాపకుడిగా ఉన్న విశ్వశాంతి ఫౌండేషన్ ద్వారా రూ. 3 కోట్ల విరాళం బాధితుల కోసం ఇస్తున్నట్టు తెలిపారు.

## చేనేత వస్త్రాలను ధరిద్దాం.. నేతన్నలకు ప్రోత్సాహాన్ని అందిద్దాం: సీఎం రేవంత్



**హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్):** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేతన్నలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. నాటి స్వాతంత్ర్య సంగ్రామంలో ఒక సాధనమైన చేనేత నేటి తెలంగాణ పునర్నిర్మాణంలోనూ ప్రధానంగా నిలిచిందని తెలిపారు. చేనేతకు పునరుజ్జీవనం కల్పించడానికి ప్రజాప్రభుత్వం బాధ్యత వహిస్తుందన్నారు. మహిళా శక్తి గ్రూప్‌లు, ప్రభుత్వ శాఖల ద్వారా చేనేతను ప్రోత్సహించే కార్యక్రమాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. 'నిండైన భారతీయతకు నిజమైన అందాన్ని ఇచ్చే చేనేత వస్త్రాలను ధరిద్దాం. నేతన్నలకు ప్రోత్సాహాన్ని అందిద్దాం. నేతన్నలకు జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు' అంటూ తెలంగాణ కాంగ్రెస్ ఎక్స్ హ్యాండిల్ ట్వీట్ చేసింది.

## మళ్లీ లక్ష్మయ్య వాగుకు వరద



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** అల్పపీడన ద్రోణి, ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షానికి వాగులు పొంగి పొర్లాయి. సోమవారం రాత్రి నుండి ముసురు పట్టి తెరుపు లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో భారీ వర్షం కురిసింది. మరోపక్క పులిచింతల ప్రాజెక్టు నుండి నీరు దిగువకు వదలటంతో కృష్ణానదికి వరద చేరింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు కంచికచర్ల మండలం చెవిటికల్లు వద్ద ఉన్న లక్ష్మయ్య వాగుకు భారీ వరద ప్రవహించింది. చెవిటికల్లు వద్ద లక్ష్మయ్య వాగు ప్రవాహానికి వరద నీరు రోడ్డ పై 5 అడుగుల మేర ప్రవహించింది. ధీంతో కంచికచర్ల, చెవిటికల్లు కు రాకపోకలు నిలిచిపోయాయు. 20 రోజుల కిందట కురిసిన వర్షాలకు లక్ష్మయ్య వాగుకు వరద చేరి రెండు రోజుల పాటు రాకపోకలు నిలిచిన విషయం తెలిసిందే. మళ్లీ బుధవారం లక్ష్మయ్య వాగుకు వరద చేలటంవల్ల 20 రోజుల వ్యవధిలో ఛెవిటికల్లు కు రాకపోకలు నిలిచిపోయాయి. లక్ష్మయ్య వాగు కు వరద చేలటంవల్ల వాగు పరీవాహ ప్రాంతాల్లో పంట పొలాలు నీట మునిగాయి. ప్రతిఏటా చిన్నపాటి వర్షానికే లక్ష్మయ్య వాగు వరదకు చేరి చెవిటికల్లు వాసులకు రాకపోకలకు ఇబ్బందులు కలగటం ఆనవాయితీగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు స్పందించి చెవిటెకల్లు లక్ష్మయ్య వాగు పై వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## స్వీపర్లు, ఆయాల తొలగింపును నిరసిస్తూ ఆందోళన




**పత్తికొండ రూరల్ (జర్నలిస్ట్ ఫైల్):** పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్లు, ఆయాల తొలగింపును నిరసిస్తూ పత్తికొండలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. పత్తికొండ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లోని పాఠశాలల్లో పారిశుధ్య సిబ్బందిగా పనిచేస్తున్న వారిని అధికార పార్టీ నాయకులు తొలగించడం అన్యాయమని ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి ఎన్ కృష్ణయ్య, తాలూకా అధ్యక్ష కార్యదర్శులు నెట్టే కంటయ్య రంగన్న అన్నారు. తొలగించిన వారిని తిరిగి విధుల్లో కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ప్రజాసంఘాల నాయకులు మద్దిలేటి శెట్టి కారణ మాదన్న, గుండు భాషా, సుంకులమ్మ సిద్ధమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత నియోజకవర్గంగా రాజోలు



**అంతర్వేది(జర్నలిస్ట్ ఫైల్):** జిల్లాలోని రాజోలుని ప్లాస్టిక్ రహిత నియోజకవర్గంగా తీర్చి దిద్దుదామని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ప్లాస్టిక్ నిషేధ ప్రతులను అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో విడుదల చేశారు. ఎక్కడ పడితే అక్కడ ప్లాస్టిక్‌ను పారేయకుండా సేకరించాలని, వాటికి కిలో రూ. 7 చొప్పున కొనుగోలు చేసేందుకు ఓ కంపెనీ ముందుకొచ్చిందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## హాస్టల్ విద్యార్థుల సమస్యలపై ధర్నా



**అనకాపల్లి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ హాస్టల్లో సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అనకాపల్లి కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం డిఆర్ఓ శ్రీనివాస్‌కి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి. ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో ఎస్సీ ఎస్టీ బీసీ సంక్షేమ హాస్టల్లో సర్వే ద్వారా విద్యార్థులు చాలా దయానీయ పరిస్థితుల్లో ఉంటున్నారనేది తమకు అర్థమైందని తెలిపారు. ముఖ్యంగా కొన్ని వసతి గృహాల భవనాలు శిధిలావస్థకు చేరి పెచ్చులు ఊడిపోతూ వర్షానికి కారిపోతూ ఉండడంవల్ల విద్యార్థులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని హాస్టళ్లలో ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అద్దె భవనంలో ఉన్న వసతిగృహాలు విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, గదులు లేక తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు. వాటికి సొంతభవనాలు నిర్మించి, శిధిలావస్థలో ఉన్న భవనాలను పునర్ నిర్మించాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జెస్ పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు జిల్లా అధ్యక్షుడు బి. బాబ్జి, జగదీష్, సింహాద్రి, సతీష్, రంజిత, రాజేశ్వరి వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు.

## నిందితులకు రిమాండ్ పొడిగింపు

**గన్నవరం(జర్నలిస్ట్ ఫైల్):** కృష్ణా జిల్లా గన్నవరం తెదేపా కార్యాలయంపై దాడి కేసులో నిందితులకు రిమాండ్‌ను కోర్టు పొడిగించింది. 18 మంది నిందితులను పోలీసులు స్థానిక కోర్టులో ప్రవేశపెట్టారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం.. ఈనెల 21వ వరకు రిమాండ్ పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అనంతరం నిందితులను నూజివీడు, గన్నవరం సబ్ జైలుకు తరలించారు.

# తెలుగు రాష్ట్రాల్లో చేనేత దినోత్సవం కార్యక్రమాలు



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** ఇవాళ జాతీయ చేనేత దినోత్సవం. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున కార్యక్రమాలు జరుగుతున్నాయి. రాజకీయ ప్రముఖులంతా చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మంగళగిరిలో జరిగిన చేనేత దినోత్సవంలో టీడీపీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చేనేతలకు మంత్రి నారా లోకేష్ తన సొంత నిధులతో 27 రకాల సంక్షేమ పథకాలను అందించారన్నారు. వారి జీవితాల్లో నూతన వెలుగు రేఖలు తీసుకొచ్చారన్నారు. నూతన సాంకేతిక నైపుణ్యాలను పరిచయం చేసి వారి ఆదాయం పెంపునకు కృషి చేశారని అనురాధ తెలిపారు. అధునాతన రాట్నాలు, మగ్గాలు ఉచితంగా అందించారని పంచుమర్తి అనురాధ తెలిపారు. చేనేత వస్త్రాలకు అంతర్జాతీయ బ్రాండింగ్ తెచ్చారన్నారు. అందుకే లోకేష్ ను 91,413 భారీ ఓట్ల మెజారిటీతో గెలిపించారన్నారు. చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు నారా లోకేష్ కృషి చేస్తున్నారని పంచుమర్తి అనురాధ తెలిపారు. వర్షం కారణంగా సీఎం చంద్రబాబు చీరాల పర్యటన రద్దు అయ్యింది. నేడు చీరాలలో జరిగే చేనేత దినోత్సవంలో ఆయన పాల్గొనాల్సి ఉంది. కానీ వర్షం కారణంగా ఇది రద్దైంది. చంద్రబాబు విజయవాడలో జరిగే చేనేత కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఇక జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని పెడనలో చేనేత తయారీ మగ్గాలను జిల్లా కలెక్టర్ బాలాజీ , పెడన శాసన సభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పరిశీలించారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని ఆగస్టు 7న దేశవ్యాప్తంగా ప్రతి ఏట నిర్వహిస్తారు. భారత స్వాతంత్ర్యోద్యమములో ప్రధాన భూమిక పోషించి, స్వాతంత్ర్య సమపార్జనకు ఒక సాధనంగా నిలిచింది చేనేత. గాంధీజీ కూడా రాట్నంపై నూలు వడకడానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. అంతటి ప్రాధాన్యత కలిగిన చేనేతరంగానికి ఒకరోజు ఉండాలన్న ఉద్దేశంతో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఏర్పాటుచేయడం జరిగింది. ఈ క్రమంలోనే 2015, ఆగస్టు 7న చెన్నైలో జరిగిన కార్యక్రమంలో భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతీయ చేనేత దినోత్సవాన్ని ప్రారంభించి, భారత చేనేత లోగోను ఆవిష్కరించడంతోపాటూ ఆగస్టు 7వ తేదీని జాతీయ చేనేత దినోత్సవంగా పరిగణిస్తున్నట్లు ప్రకటించారు.

# విఆర్ఎలకు వాచ్‌మెన్ డ్యూటీలు రద్దు చేయాలి




**అనకాపల్లి(జర్నలిస్ట్ ఫైల్):** విఆర్ఎలకు వాచ్‌మెన్ డ్యూటీలను రద్దు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర వ్యాప్త పిలుపుమేరకు మంగళవారం అనకాపల్లి ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూఏ నిబంధనలకు విరుద్ధంగా వీఆర్ఏలకు మండల రెవెన్యూ కార్యాలయాలు వద్ద రాత్రి డ్యూటీలు వేశారని, వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ రెవెన్యూ సహాయకులు గ్రామాల్లో రెవెన్యూకి సంబంధించిన ప్రభుత్వ పనులు నిర్వహిస్తారని, అటువంటిది ప్రభుత్వం వాచ్‌మెన్ డ్యూటీలు వేస్తూ ఉత్తర్వులు ఇవ్వడం దారుణమన్నారు. గ్రామ రెవెన్యూ సహాయకులు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకుండా కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు.

మరోవైపు గత ఐదు సంవత్సరాలుగా వీఆర్ఏలను ప్రమోషన్లు ఇవ్వలేదని అనేకమంది అర్హత ఉండి అటెండర్లుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా, డ్రైవర్లుగా విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఖాళీలు వెంటనే భర్తీ చేసి ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అనంతరం రెవెన్యూ డివిజన్ అధికారి చిన్నికృష్ణకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా కార్యదర్శి ఎన్.గంగాధర్ రావు, అధ్యక్షులు కె.రవికుమార్, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్రావు, ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, వీఆర్ఏల యూనియన్ కార్యవర్గ సభ్యులు శాంతి, నాగేశ్వరరావు, ఎం.సంతోష్, కుమార్, సింహాచలం, పరదేశి నాయుడు రాజు,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మెడికవర్ హాస్పిటల్ లో బ్రెస్ట్ ఫీడింగ్ అవగాహన సదస్సు




**విశాఖ , (జర్నలిస్ట్ ఫైల్):** తల్లిపాలు బిడ్డకి ఆరోగ్యాన్ని పెంపొందించడమే కాకుండా తల్లీ బిడ్డకి మధ్య చక్కని ప్రేమ బంధాన్ని పెంపొందిస్తుంది. బిడ్డ మానసిక ఆరోగ్యం చక్కగా వృద్ధి చెందుతుంది' అని మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు తెలిపారు. నగరంలోని మెడికవర్ ఉమెన్ అండ్ చైల్డ్ హాస్పిటల్ లో అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల అవగాహనలో భాగంగా తల్లిపాల (బ్రెస్ట్ ఫీడింగ్) విశిష్టతను తెలియజేస్తూ తల్లిపాల పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్లినికల్ డైరెక్టర్ ప్రముఖ నియోనాటాలజిస్ట్ డాక్టర్ సాయి సునీల్ కిశోర్ మాట్లాడుతూ తల్లిపాల నుంచి పిల్లలకు పోషకాలు పుష్కలంగా లభిస్తాయనీ, శిశువుకు సులభంగా జీర్ణమవుతుంది అన్నారు. కానీ మనదేశంలో బ్రెస్ట్ ఫీడింగ్ రేట్ తక్కువగా ఉందన్నది మాత్రం వాస్తవం అన్నారు. కొంతమంది ఆరోగ్య సమస్యల వల్ల బ్రెస్ట్ ఫీడింగ్ చేయలేకపోతున్నారనీ, మరికొంతమంది, బ్రెస్ట్ ఫీడింగ్ పట్ల ఆసక్తి చూపించట్లేదనీ, స్టడీస్ ప్రకారం బ్రెస్ట్ ఫీడింగ్ వల్ల తల్లీ బిడ్డలు హెల్తీగా ఉంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ వైద్యులు నియోనాటాలజిస్ట్ డాక్టర్ కె విజయకృష్ణ, డాక్టర్ జి.మౌనిక, డాక్టర్. ఏ.మౌనిక, డాక్టర్ శ్రీరంగ, డా గీతవందన, డా. విద్య రామ, డాక్టర్ భులక్ష్మి, డాక్టర్ రాధిక, డాక్టర్ నళిని, 100 మందికి పైగా ఇతర ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# ఒంగోలు ట్రిపుల్ ఐటీ విద్యార్థిని ఆత్మహత్య



**కడప (జర్నలిస్ట్ ఫైల్):** ఒంగోలు ట్రిపుల్ ఐటీకి చెందిన విద్యార్థి జమీషా ఖురేషీ(17)అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకొన్న సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. దీంతో ఇడుపులపాయ, ఒంగోలు ట్రిపుల్ ఐటీల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళితే ప్రకాశం జిల్లా చీరాలకు చెందిన మొగల్ కుమార్తె జమీషా ఖురేషీ కి ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు రావడంతో ఇంటర్ సెకండ్ ఇయర్ (పి-2) చదువుతున్నది. ఇడుపులపాయ ట్రిపుల్ ప్రాంగణంలో ఉన్న ఒంగోలు ట్రిపుల్ క్యాంపస్ చదువుతున్న జమీషాఖురేషి గత మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో బ్రాత్ రూంలో తన చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొని మృతి చెందినట్లు ట్రిపుల్ ఐటీ అధికారులు తెలిపారు. స్థానిక విద్యార్థుల సమాచారంతో ట్రిపుల్ ఐటీ అధికారులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విద్యార్థిని మృతదేహాన్ని అర్ధరాత్రి వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మంగళవారం మధ్యాహ్నం ఫైనల్ ఇయర్ కు చెందిన ఓ విద్యార్థిని మొబైల్ ఫోన్ క్యాంటీన్ వద్ద పోయింది. ఆ మొబైల్ ఫోన్ ను మృతి చెందిన అమ్మాయి తీసుకున్న విషయాన్ని గుర్తించిన ట్రిపుల్ ఐటి అధికారులు విద్యార్థినిని మందలించడంతోపాటు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారని, తల్లిదండ్రులతో విద్యార్థినితో మాట్లాడించినట్లు తెలిసింది. దీంతో అ విద్యార్థిని జమీషాఖురేషి మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు ఆరోపణలు బలం గా వినిపిస్తున్నాయి.

స్టడి అవర్ లో విద్యార్థిని కనపడకపోవడంతో విద్యార్థిని కోసం వెతకడం జరిగిందని సిబ్బంది తెలిపారు. అయితే రాత్రి 11 గంటలకు బ్రాత్ రూంలో చున్నీతో ఉరి వేసుకొన్న సంఘ టన చూసి ఇడుపులపాయలోని ఆసుపత్రికి తరలించి అక్కడ నుంచి వేంపల్లె ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. విషయం కనుగొన్న సమయానికి విద్యార్థిని మృతి చెందినట్లు సిబ్బంది చెప్పారు. విద్యార్థిని మృతి చెందిన విషయాన్ని తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు కూడ ఇడుపులపాయకు బయలు దేరి వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ పోలీసులు ఆరా తీస్తున్నారు.

# ఈపూరుపాలెంలో కిరాతకం

## కారుకు సైడ్ ఇవ్వలేదని యువకుడిని చంపేశారు




**చీరాల (జర్నలిస్ట్ ఫైల్):** కారుకు సైడ్ ఇవ్వలేదని 18 ఏళ్ల యువకుడిని కత్తులతో అతికిరాతకంగా పొడిచి చంపిన సంఘటన బాపట్ల జిల్లా ఈపూరుపాలెం-ఆదినారాయణపురం మధ్య జరిగింది. మృతుడి స్నేహితుడు మనోజ్ తెలిపిన వివరాల మేరకు మనోజ్, సయ్యద్ ఆరిఫ్ (18) ఇద్దరూ స్నేహితులు. మనోజ్ బైక్ పై, ఆరిఫ్ సైకిల్ పై మాట్లాడుకుంటూ చీరాల నుంచి ఈపూరుపాలెంకు వస్తున్నారు. వెనుక నుంచి వస్తున్న ఓ పెద్ద కారు చీరాల నుంచి బాపట్ల వైపుకు వెళుతుంది. ఆ కారులో ఐదుగురు యువకులున్నారు. వాళ్ల కారుకు సైడ్ ఇవ్వలేదని ఆరిఫ్ తో ఘర్షణకు దిగారు. వెంటనే కారులో ఉన్న కత్తులు తీసుకుని ఆరిఫ్ పై విచక్షణారహితం గా దాడి చేసి పొట్ట, మెడ, గుండెలపై పొడిచారు. తీవ్రంగా గాయపడ్డ ఆరిఫ్ ను చీరాల ఏరియా వైద్యశాలకు తరలించగా, అప్పటికే ఆరిఫ్ మరణించాడు. మృతుడి తండ్రి చీరాలలో వస్త్ర దుకాణ యజమానికి కారు డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. సైడ్ ఇవ్వలేదని చంపారా, లేక పక్కా ప్లాన్ తో చంపారా అనేది పోలీసులు విచారణలో తేలాల్సి ఉంది. సంఘటనా స్థలాన్ని టూటౌన్ సిఐ సోమశేఖర్ పరిశీలించి కేసు నమోదు చేశారు. ఇది ఇలా ఉంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన ఉన్న నేపథ్యంలో హత్య జరగడంతో ఎలాంటి అల్లర్లు జరగకుండా ఉండే విధంగా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఏది ఏమైనా బాపట్ల జిల్లా చీరాల కేంద్రాల నేరాలకు కేరాఫ్ గా మారిందని చెప్పవచ్చు. ఇప్పటికే వరుస హత్యాలతో చీరాల-ఈపురుపాలెం ప్రాంత ప్రజలు భయభ్రాంతులకు లోనవుతున్నారు.

## అన్న క్యాంటీన్లను పరిశీలించిన కమిషనర్ మౌర్య



**తిరుపతి (జర్నలిస్ట్ ఫైల్):** నగరం పరిశుభ్రంగా ఉండాలంటే ప్రజలు తమవంతుగా సహకారం అందించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య కోరారు. బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి పర్యటించారు. డివైడర్లపై ఉన్న, అనధికారిక బోర్డులు వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. పునః ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్న అన్న క్యాంటీన్లను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనులు సాయంత్రంలోపు పూర్తి చేయించాలని అధికారులకు సూచించారు. కమిషనర్ వెంట అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ వెంకట్రామి రెడ్డి, డి.ఈ శ్రావణి, డి.సి.పి. శ్రీనివాసులు రెడ్డి, ఏసిపి బాల సుబ్రమణ్యం, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## అన్న క్యాంటీన్లను పరిశీలించిన కమిషనర్ మౌర్య



**తిరుపతి (జర్నలిస్ట్ ఫైల్):** నగరం పరిశుభ్రంగా ఉండాలంటే ప్రజలు తమవంతుగా సహకారం అందించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య కోరారు. బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి పర్యటించారు. డివైడర్లపై ఉన్న, అనధికారిక బోర్డులు వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. పునః ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్న అన్న క్యాంటీన్లను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనులు సాయంత్రంలోపు పూర్తి చేయించాలని అధికారులకు సూచించారు. కమిషనర్ వెంట అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ వెంకట్రామి రెడ్డి, డి.ఈ శ్రావణి, డి.సి.పి. శ్రీనివాసులు రెడ్డి, ఏసిపి బాల సుబ్రమణ్యం, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## భాజపా కార్యాలయంలో జాతీయ చేనేత దినోత్సవం



**పార్వతీపురం టౌన్ (జర్నలిస్ట్ ఫైల్):** జిల్లా కేంద్రంలోని భాజపా కార్యాలయంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు అధ్యక్షతన వేడుకలు జరిగాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి చేనేత కార్మికులు హాజరయ్యారు. వారిని నాయకులు ఘనంగా సన్మానించారు. కేంద్ర ప్రభుత్వం చేనేత కార్మికుల ఆర్థికాభివృద్ధి కోసం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని శ్రీనివాసరావు అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి సంజీవ్, నాయకులు పేర్రాజు, బంగారు నాయుడు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## తిరుమల ఘాట్ రోడ్డులో ప్రమాదం.. ఇద్దరు మృతి



**తిరుమల (జర్నలిస్ట్ ఫైల్):** తిరుమల తిరుపతి ఘాట్ రోడ్డులో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. బుధవారం ఉదయం రెండవ ఘాట్‌రోడ్డులో చివరిమలుపు వద్ద బైక్‌ను ఆర్టీసీ బస్సు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ పై ఉన్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. కాగా బస్సు కింద మృతదేహాలు ఇరుక్కుపోయాయి. పోలీసుల సంఘటన స్థలానికి చేరుకుని క్రేన్ సాయంతో దేహాలను బయటకు తీసేందుకు అధికారుల ప్రయత్నిస్తున్నారు. కాగా ఈ ప్రమాదంలో మృతి చెందిన వారిని తమిళనాడుకు చెందిన దంపతులు గా గుర్తించారు.

## వైసీపీకి పిఠాపురం మాజీ ఎమ్మెల్యే దొరబాబు రాజీనామా



**పిఠాపురం (జర్నలిస్ట్ ఫైల్):** కాకినాడ జిల్లా పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు వైసీపీకి రాజీనామా చేశారు. ఈ మేరకు పిఠాపురంలోని తన నివాసం వద్ద ఆయన మీడియాకు ఈ విషయాన్ని వెల్లడించారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం తాను టిడిపి కూటమితో కలిసి పని చేస్తానని వెల్లడించారు. ఏ పార్టీలో చేరుతాననే విషయాన్ని అనుచరులుతో చర్చించి త్వరలో వెల్లడిస్తానన్నారు.

## జగన్ గారూ...ఇంకా మీరే ముఖ్యమంత్రి అనే భ్రమ నుంచి బయటకు రండి



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ప్రతిపక్ష హోదా కూడా రాని స్థాయి ఓటమిని ప్రజలు కట్టబెట్టినా జగన్మోహన్ రెడ్డికి సిగ్గు రావడంలేదు. నైతిక విలువలు, విశ్వసనీయత అంటూ పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారు. ఇంకా మీరే ముఖ్యమంత్రిననే భ్రమల్లో ఉంటే ఎలా పులివెందుల ఎమ్మెల్యే గారూ? భ్రమలు వీడి వాస్తవంలోకి రండి.. ప్రజా ప్రభుత్వ పాలన ఎలా ఉందో తెలుస్తుంది. ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తన అభ్యర్థిని పోటీనే పెట్టకూడదనడానికి మీరెవరు? మీకు ఆ అధికారం ఎవరిచ్చారు?
గతంలో రాజభవన్ కి వెళ్లి ఫిర్యాదు చేసినప్పుడు, 20 మంది టీడీపీ ఎమ్మెల్యేలు టచ్ లో ఉన్నారు..నేను తలుచుకుంటే టీడీపీ ప్రభుత్వం కూలిపోతుందని ప్రకటనలు చేసినప్పుడు విలువలు గుర్తుకురాలేదా? విలువల గురించి మాట్లాడే ముందు గడిచిన ఐదేళ్లలో రాష్ట్రాన్ని లూటీ చేసిన విధానం, అక్రమాస్తుల కేసులో సీబీఐ వేసిన 11 చార్జ్ షీట్ల గురించి ప్రజలకు చెప్పే దమ్ముందా? మీ శవ రాజకీయాలకు, వికృత రాజకీయ క్రీడలకు, విషసంస్కృతికి కాలం చెల్లింది. మేం తలుచుకుంటే వైసీపీ ఖాళీ అయిపోతుంది అని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు.

# ఇక చేనేత కార్మికులకు స్వర్ణయుగమే

- రాష్ట్రంలో చేనేతకు పూర్వ వైభవం తెస్తాం
- నేతన్నల సంక్షేమంపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి
- చేనేత కార్మికుల కుటుంబ సభ్యులందరికీ జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు
- రాష్ట్ర చేనేత, జౌళిబీ బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత

**విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** రాష్ట్రంలో చేనేతకు పూర్వ వైభవం తెచ్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం కృషిచేస్తోందని చేనేత, జౌళిబీ బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో నగరంలోని మేరీస్ స్టెల్లా కాలేజీ వద్ద ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర చేనేత, జౌళిబీ బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత.. విజయవాడ తూర్పు శాసనసభ్యులు గద్దె రామమోహన్, రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి కె.సునీత, కమిషనర్ జి.రేఖారాణి, ఆర్కియాలజీ, మ్యూజియమ్స్ కమిషనర్ జి.వాణీ మోహన్ తదితరులు చేనేత వాకథాన్‌ను ప్రారంభించారు. చేనేత వస్త్రాలు ధరిద్దాం.. చేనేత కళను ప్రోత్సహిద్దామంటూ పిలుపునిచ్చారు.




ఈ సందర్భంగా మంత్రి ఎస్.సవిత మాట్లాడుతూ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కార్మికుల కుటుంబ సభ్యులందరికీ జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. పోగును వస్త్రంగా తయారుచేసి మనిషి మానాన్ని కాపాడుతున్న చేనేత కార్మికులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ హయాం చేనేతకు స్వర్ణయుగమని.. నేత కార్మికులకు రాజయోగమేనన్నారు. చేనేత కార్మికుల కష్టాలపై ముఖ్యమంత్రికి పూర్తి అవగాహన ఉందని.. వారిని అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఆయన నేతన్నలకు పూర్తి ఆసరాగా నిలిచారన్నారు. వారికి సుస్థిర జీవనోపాధికి వివిధ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు అమలుచేశారన్నారు. అయితే గత కొన్నేళ్లలో నేతన్నలకు సరైన ఆదాయం లేక, వారి ఉత్పత్తులు కొనేవారు లేక వలసపోయే పరిస్థితి వచ్చిందని.. ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు కూడా చోటుచేసుకున్నాయన్నారు. నిర్వీర్యమైన చేనేతకు మళ్లీ పూర్వవైభవం తెస్తామని.. నేతన్నలను ప్రోత్సహించే క్రమంలో ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించాలని ఈ సందర్భంగా మంత్రి సవిత పిలుపునిచ్చారు.

చేనేత కళపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు కృషి: శాసనసభ్యులు గద్దె రామమోహన్

విశిష్టమైన చేనేత కళపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు చేస్తున్న కృషిలో భాగంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు విజయవాడ తూర్పు శాసనసభ్యులు గద్దె రామమోహన్ అన్నారు. చేనేత ఔన్నత్యాన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ఆదరించాలని కోరారు. విదేశీ వస్త్రాలను బహిష్కరించాలన్న లక్ష్యంతో స్వదేశీ ఉద్యమం వచ్చిందని.. 1905, ఆగస్టు 7న విదేశీ వస్త్రాలను బహిష్కరించడంతోపాటూ దేశీయోత్పత్తుల పునరుద్ధరణకు పిలుపునిచ్చిన చారిత్రక ఘటనకు గుర్తింపుగా గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ 2015లో ఆగస్టు 7ను జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించారని వివరించారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో చేనేత కీలకభూమిక పోషించిందన్నారు. అగ్గిపెట్టలో సైతం ఇమిడిపోయే చీరను తయారు చేసిన అద్భుత నైపుణ్యం మన నేతన్నల సొంతమని శాసనసభ్యులు రామమోహన్ అన్నారు.
చేనేత వాకథాన్‌లో స్థానిక కార్పొరేటర్ దేవినేని అపర్ణ, ఆప్కో ఎండీ ఆర్.పవనమూర్తి, జాయింట్ డైరెక్టర్లు కన్నబాబు, ఎం.నాగేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా చేనేత, జౌళి అధికారి ఎస్.రఘునందన్, ఎస్ఆర్ఆర్-సీవీఆర్ కళాశాల ప్రిన్సిపల్ కె.భాగ్యలక్ష్మి, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రపంచం గర్వించే కవి

**అమరావతి, ( జర్నలిస్ట్ ఫైల్ ) :** భారతదేశానికి నోబెల్ బహుమతి తీసుకువచ్చిన గొప్ప కవి గా రవీంద్రనాథ్ టాగోర్ నిలుస్తారని ఏఎన్యూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కంచర్ల గంగాధర రావు అన్నారు. బుధవారం ఠాగూర్ 83వ వర్ధంతిని పురస్కరించుకొని వర్సిటీలో ఉన్న ఆయన విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వీసి మాట్లాడుతూ కవిగా సాంఘిక సంస్కర్తగా, స్వరకర్తగా , నాటక రచయితగా ఆయన భారతీయులలో భావోద్వేగాలను రేకెత్తించారని అన్నారు. నేటి విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఆ లక్ష్యం సాధించే క్రమంలో ఠాగూర్ వంటి మహా మేధావులను అనుసరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి .సింహాచలం, సి డి సి ఇన్చార్జి డీన్ ప్రొఫెసర్ వి .రవికుమార్, సి ఎస్ ఆర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎన్వి రమణ, యూనివర్సిటీ ఇంజనీర్ డి. ఏ. కుమార్ రాజు, ఉద్యోగులు , టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు బి. హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

# వక్ఫ్ బోర్డు చట్ట సవరణ అవసరం లేదు

- ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మక్బూల్ భాష

**కడప జిల్లా (జర్నలిస్ట్ ఫైల్) :** దేశంలో అతిపెద్ద స్థాయిలో సంపద ఉన్న వక్ఫ్ సంస్థకు సంబంధించిన వక్ఫ్ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం పలు సవరణలు చేస్తోందని గత కొన్ని రోజులుగా సామాజిక మధ్యమాలలో వార్తలు వస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టంలో సవరణలు చేయాల్సిన అవసరం లేదని ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి షేక్ మక్బూల్ భాష తమ కమిటీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలియజేశారు.
మా పూర్వీకులు చాలా పెద్ద ఎత్తున ఖరీదైన ఆస్తులను భూములను దానం చేశారని ఆ రోజుల్లోనే ఇస్లామిక్ చట్టం ప్రకారం వక్ఫ్ అయిందని ఇందులో కేంద్రం జోక్యం అవసరం



లేదని ఆయన అన్నారు. ఇది కేవలం ఎన్డీఏ కూటమి చేస్తున్న దొంగ నాటకం అని, కోట్ల విలువ చేసే వక్ఫ్ బోర్డ్ ఆస్తులను కాచేయాలన్న ఉద్దేశంతో బిజెపి ప్రభుత్వం ఆడుతున్న దొంగ నాటకమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఒక్కసారి వక్ఫ్ బోర్డు చట్టం ఏముందో చదువుకోవాలని చదవటం రాక ఆస్తులు కాజేయాలన్న కోరికతో దేశంలో అతి పెద్ద సంపద విలువ అయినటువంటి వక్ఫ్ బోర్డ్ ఆస్తులపై కన్ను పడినట్టు ఉన్నది ఆయన అన్నారు. చట్టం గురించి తెలియకపోతే జాతీయ సంస్థలైనా ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు, జమియత్ ఉలేమా ఏ హింద్, జమాత్ ఇస్లామీ హింద్, ఉలేమా కౌన్సిల్, సున్ని జమాత్, షియా జమాత్ తదితర ముస్లిం సంఘాలతో కేంద్ర ప్రభుత్వం అభిప్రాయాలు సేకరించిన తరువాతనే వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సవరణలు పక్కనపెట్టి వక్ఫ్ బోర్డు ఆస్తులు సంబంధిత స్వచ్ఛంద సేవలకి నిబంధనలు ప్రకారం ఉపయోగించాలని ఆయన అన్నారు. వక్ఫ్ బోర్డ్ చట్ట సవరణ బిల్లును ఇండియా కూటమి మిత్రపక్ష పార్టీలన్నీ వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆప్ కి ఆవాజ్ నగర అధ్యక్షులు ఆబిద్ హుస్సేన్ పాల్గొన్నారు.

## రాయలసీమ ప్రాజెక్టులకు ప్రాధాన్యత లేకపోవడం విచారకరం

- హక్కులు అవకాశాలు కోల్పోయిన రాయలసీమను విస్మరిస్తే ఉద్యమమే...
- గాలి చంద్ర సిపిఐ జిల్లా కార్యదర్శి

**కడప జిల్లా (జర్నలిస్ట్ ఫైల్)** రాష్ట్ర జల వనరుల శాఖ రాష్ట్రంలో ప్రాధాన్యత క్రమంలో 5 ప్రాజెక్టుల పూర్తి కి 8734 కోట్ల వ్యయంతో ఒక లక్ష 71 వేల ఎకరాల కొత్త ఆయకట్టు, 14 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ కోసం చేయబోయే ప్రాజెక్టుల జాబితాలో రాయలసీమలోని గాలేరు నగరి హంద్రీనీవా తెలుగంగ కేసీ కెనాల్ ప్రస్తావనే లేకపోవడం విచారకరమని మంగళవారం స్థానిక ఎర్రగుంట్ల మార్క్స్ భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో గాలి చంద్ర పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కరువు వలసలు ఆత్మహత్యలకు నిలయంగా మారిన రాయలసీమలో నీటిపారుదల ప్రాజెక్టులు లేకపోవడం వల్ల వర్షాలపై ఆధారపడి వరుస కరువులతో రైతులు నష్టపోతున్నారన్నారు.
వేసవి ఆరంభంలోనే భూగర్భ జలాలు గణనీయంగా పడిపోయి గుక్కెడు మంచినీటి కోసం కటకటా అనాల్సిన పరిస్థితి ఎదురవుతున్నదన్నారు. రాయలసీమ కన్నీటి వెతలు తీరాలంటే కృష్ణా జలాలు రాయలసీమకు మళ్ళించాలన్న సంకల్పంతో జరిగిన పోరాటాలకు చేపట్టిన ప్రాజెక్టులు పాలకుల నిర్లక్ష్యానికి, నిధుల లేమితనంతో దశాబ్దాలుగా నత్తనడకన సాగుతున్నాయన్నారు. 1951 లో కృష్ణా పెన్నార్ ప్రాజెక్టు, నీటి వివాదాలపై ఏర్పాటైన బచావత్ ట్రిబ్యునల్ 2000 సంవత్సరం వరకు అమరులు ఉన్నప్పటికీ ప్రాజెక్టులు పూర్తిగా కాక నికరజలాలు




కోల్పోవాల్సి వచ్చింది అన్నారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తో మిగులు జలాలను కూడా కోల్పోయామన్నారు. మిగులు జలాలపై హక్కుల కోసం పోరాడుతున్న ప్రభుత్వం మిగులు జలాల ఆధారిత ప్రాజెక్టులు పూర్తిచేసే బాధ్యతను విస్మరించడం శోచనీయమన్నారు. జాతీయ హోదా కలిగిన పోలవరం ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వంతో పూర్తి చేయించే బాధ్యత ఎన్డీఏ కూటమి కీలక నేత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుదే అన్నారు. వారంలో ఒకరోజు పోలవరం పర్యవేక్షణ అంటున్న చంద్రబాబు రాయలసీమ ప్రాజెక్టుల గురించి గానీ, ప్రాజెక్టుల ప్రాధాన్యత గురించి గానీ మాట్లాడకపోవడం పలు అనుమానాలకు ఆజ్యం పోసినట్లున్నారు.
అసలే చంద్రబాబు నాయుడు పై రాయలసీమ అన్నా, సీమ రైతాంగ సమస్యలు అన్న పట్టవు అనే అపోహలు ఉన్నాయన్నారు. ఐదు సంవత్సరాల జగన్ పాలనలో ఎగువ భద్ర కు జాతీయ హోదా, కృష్ణా నది జలాల కేటాయింపు పై పున్న సమీక్ష తో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. హక్కులు అవకాశాలు కోల్పోయిన రాయలసీమ మరో మారు నష్టపోవడానికి సిద్ధంగా లేదన్నారు.
ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బదులు కేటాయించి రాయలసీమ ప్రాజెక్టులకు నిధులు కేటాయించి యుద్ధ ప్రాతిపదికన పూర్తికి పూనుకోకపోతే ఉద్య తప్పదని వారు హెచ్చరించారు.
సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎంవి సుబ్బారెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి భవాని శంకర్, చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి వరప్రసాద్, ఏ ఐ ఎస్ ఎఫ్ నాయకులు శరత్ తదితరులు పాల్గొన్నారు.

# మంగళగిరిలో ఘనంగా 10వ జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమం

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంను ప్రారంభించారు. 10 మందికి పైగా చేనేత కార్మికులను సన్మానించి 110 మంది చేనేత కార్మికులకు సబ్సిడీతో కూడిన బ్యాంక్ రుణాలను అందజేశారు.
ఈ సందర్భంగా రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, వైద్య విద్యా శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ... మొదటగా తెలుగు రాష్ట్రాలలోని నేతన్నలందరికి జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానన్నారు. ఈ రోజు నుండి వారం రోజుల పాటు చేనేత వారోత్సవాలు నిర్వహించుకునే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం తరపున జౌళి శాఖ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ చేనేత పరిశ్రమ మీద ఆదరణ కలిగేలా చర్యలు తీసుకుంటుందన్నారు. మంగళగిరి ఆర్థిక అభివృద్ధి చేనేత రంగంతో ముడిపడి ఉందని, ఇలాంటి ముఖ్య పట్టణంలో నేతన్నల మధ్య కార్యక్రమం నిర్వహించుకోవడం చాలా సంతోషంగా వుందన్నారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ మీద అందిస్తున్న పనిముట్లు , అనుబంధ పరికరాల మీద రాయితీలు , డిజైనింగ్ , పంచింగ్ మిషన్ లపై , నూతన కార్యక్రమాల మీద నేతన్నలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. తద్వారా ఆ కార్యక్రమాల ద్వారా లబ్ది పొందేలా చేయడమే కాకుండా కేంద్రం బ్యాంకుల ద్వారా అందించే ఋణాలు అందిపుచ్చుకొని చేనేత రంగంలోని వారికి తోడ్పాటు అందించేలా చేయడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ముద్రా ఋణాలు , బ్యాంకుల ద్వారా కోటి 7 లక్షల రూపాయలను నేతన్నల కుటుంబాలకు అందించడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం చేనేతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి చేనేత దినోత్సవ వారోత్సవాలు జరుపుకుంటూ పెద్ద ఎత్తున రాయితీలు అందిస్తూ , ముడి సరుకుకు, మగ్గాలకు రాయితీ అందిస్తూ నైపుణ్య శిక్షణ నిస్తూ మార్కెటింగ్ వ్యవస్థను కల్పించి ఆదుకుంటుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో సహకార రంగాన్ని నిర్వీర్యం చేశారన్నారు. నాలుగున్నర లక్షల మంది నేతన్నలు చేనేత రంగం మీద ఆధారపడి జీవిస్తుంటే కేవలం 26 వేల మందికే లబ్ది కల్పించి ఆర్భాటంగా ప్రచారం చేసుకోవడం జరిగిందన్నారు. ఇన్ని వేల మందికి చేయూతనందిస్తుంటే నేతన్నలు ఆత్మహత్య ఎందుకు చేసుకుంటున్నారని , నా నియోజకవర్గం ధర్మవరంలో 60 మంది చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. ఇలాంటివి నివారించి అన్ని వసతులు కల్పించి, నైపుణ్యం పెంచి ప్రజల్లో చేనేత వస్త్రాల పట్ల ఆదరణ కలిగేలా ప్రభుత్వం చేనేతలకు అండగా నిలిస్తుందన్నారు. రాబోయే రోజుల్లో ఆంధ్ర ప్రదేశ్ లోని నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపే కార్యక్రమం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం చేస్తుందన్నారు. ఇప్పటికే 50 సంవత్సరాలు పైబడిన వారికి పెన్షన్లు ఇవ్వడం జరిగింది, రాబోయే రోజుల్లో అన్ని రకాల లోన్లు , సబ్సిడీలు , పనిముట్లు , కెమికల్స్ మీద సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే వారి ఆరోగ్య భద్రత మీదా సురక్షిత బీమా యోజన , మహాత్మా గాంధీ బీమా పథకాలను వర్తింప చేసి వారి జీవితాలకు వెలుగు తెస్తామన్నారు. అలాగే సహకార రంగానికి ప్రత్యేకంగా ఒక మినిస్ట్రీ ఏర్పాటు చేసి సహకార రంగానికి తోడ్పడే విధంగా చర్యలు తీసుకుంటున్నామని , దీని వలన నేతన్నలకు లబ్ది చేకూరుతుందన్నారు.
ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ మాట్లాడుతూ... చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని అన్నారు. మంత్రి నారా లోకేష్ నియోజకవర్గ ప్రజల సంక్షేమ చేనేతలకు మంత్రి నారా లోకేష్ తన సొంత నిధులతో 27 రకాల సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు చెప్పారు. మంత్రి లోకేష్ నిరాంతరం నియోజకవర్గంలోని చేనేతలు, స్వర్ణకారులకు అందుబాటులో ఉంటూ వారి జీవనోపాధికి తోడ్పడుతున్నారని అన్నారు. మంగళగిరికి నూతన సాంకేతిక నైపుణ్యాలను పరిచయం చేసి చేనేతల ఆదాయం పెంచినట్లు తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గంలో వందలాది మంది మహిళలకు అధునాతన రాట్నాలు, మగ్గాలు ఉచితంగా అందించడంతో పాటు చేనేత వస్త్రాలకు అంతర్జాతీయ బ్రాండింగ్ తెచ్చారన్నారు. అందుకే మంత్రి లోకేష్‌ను 90 వేల మెజార్టీకి పైగా గెలిపించారన్నారు. కరోనా సమయంలో కూడా చేనేతలను ఆదుకున్న ఘనత మంత్రి నారా లోకేష్‌కే దక్కుతుందన్నారు. చేనేత కుటుంబానికి చెందిన నన్ను చాలా క్లిష్ట పరిస్థితులలో కూడా ఎమ్మెల్సీగా గెలిపించారన్నారు. మొదటి నుంచి చేనేతలను ఆదుకున్న ఘనత టీడీపీదే అని అన్నారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం చేనేతలను అసలు పట్టించుకోలేదన్నారు. నేతన్న నేస్తం పేరుతో చేనేతలను జగన్ మోసం చేశారని ఆరోపించారు. అలాగే ఎంతో మంది చేనేతలు వైసీపీ ప్రభుత్వంలో ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ... ఆగస్టు 1905లో కోల్ కత్తా లోని టౌన్ హాల్ లో మొదటిసారి స్వదేశీ ఉద్యమానికి నాంది పలికారు. అదే స్ఫూర్తిలో 110 ఏండ్ల తర్వాత 7 ఆగస్టు 2015న చెన్నైలో జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్వదేశీ వస్త్రాలనే వాడాలని పిలుపునిచ్చారు. దాంతో గత ఐదేండ్లుగా ఆగస్టు 7న 'జాతీయ చేనేత



దినోత్సవం'గా పాటిస్తున్నారు. గాంధీ జీ సైతం రాట్నంపై నూలు వడికేందుకు అత్యంత ప్రాధాన్యతనిచ్చారని, అంతటి ప్రాధాన్యత కలిగిన చేనేత రంగానికి ప్రత్యేకంగా ఒకరోజు ఉండాలన్న ఉద్దేశంతో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఏర్పాటు చేశారన్నారు. మన దేశంలో వ్యవసాయ రంగం తర్వాత ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్నది చేనేత రంగమే. చేనేతలకు బ్యాంకు రుణాలు ఎక్కువగా వచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది. చేనేతల ఆదాయ మార్గాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. జిల్లాలో 4600 మంది చేనేతలకు ఎన్టీఆర్ భరోసా ద్వారా పింఛన్లు అందించినట్లు తెలిపారు.
రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు మాట్లాడుతూ... 2017 ఆగస్టు 7న చెన్నైలో జరిగిన కార్యక్రమంలో ప్రస్తుత భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మొదటి చేనేత దినోత్సవాన్ని ప్రారంభించారని, ఈ సందర్భంగా జాతీయ భారత చేనేత లోగోను ఆవిష్కరించి, ఆగస్టు ఏడో తేదీని జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జగన్ ప్రభుత్వంలో చేనేతల పరిస్థితి చాలా దుర్భరంగా ఉండేదన్నారు. టీడీపీ పాలనలో అమలుచేసిన చేనేత పథకాలను సీఎం జగన్ నిలిపి వేశారన్నారు. నేతన్న నేస్తంను సగం మందికే అమలు చేసి అసలైన చేనేతలకు తీవ్రం అన్యాయం చేశారన్నారు. మంగళగిరిలో 5 వేలకు పైగా ఉండే మగ్గాలు 2 వేలకు పడిపోయాని చెప్పారు. మంత్రి నారా లోకేష్ మంగళగిరిలో చేనేతలకు చేయూతనందించే ఉద్దేశంతో టాటా తనేరా సంస్థతో అనుసంధానంగా ప్రారంభించిన వివర్స్ శాల బాగా నడుస్తోందని చెప్పారు. రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు కాండ్రు శ్రీనివాసరావు మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వంలో చేనేతల మనుగడకు చాలా ఇబ్బంది కలిగిందన్నారు. చేనేతలు ఉదయం నుంచి సాయంత్రం వరకు పనిచేస్తే కానీ నాలుగు వేళ్ళ లోపలికి వెళ్లడం లేదన్నారు. కులవృత్తిని నమ్ముకుని పనిచేస్తున్న చేనేతలకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ఇప్పటికైన బ్యాంకులు చేనేతలను గుర్తించి వారికి సబ్సిడీపై రుణాలు అందించాలని కోరారు. గతంలో ఎన్టీఆర్ జనతా వస్త్రాల పథకం అమలుతో రాష్ట్రంలోని చేనేతకు స్వర్ణయుగంలా మారిందని అన్నారు. నారా లోకేష్ రాష్ట్ర వ్యాప్తంగా చేనేతల ఆదాయం పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటారన్నారు. చేనేతల అభివృద్ధికి మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నట్లు చెప్పారు.
నియోజకవర్గ జనసేన ఇన్?చార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ... 2019లోనే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేనేతకు బ్రాండ్ అంబాసిడర్ గా నేనే ఉంటానని ప్రకటించినట్లు తెలిపారు. మంత్రి నారా లోకేష్ గత ఐదేళ్లుగా నియోజకవర్గ చేనేతలను ఆదుకుంటున్నారని పేర్కొన్నారు. తనేరా సంస్థ ద్వారా నియోజకవర్గంలోని చేనేతలకు మార్గం చూపిస్తున్నారని అన్నారు. చేనేతలలో సగం మంది మహిళలే ఉన్నారని, కూటమి ప్రభుత్వంలో చేనేతలు యాచించే స్థాయి నుంచి శాసించే స్థాయి ఎదుగేందుకు కృషి చేస్తామన్నారు.
మంగళగిరి పట్టణ అధ్యక్షులు దామర్ల రాజు మాట్లాడుతూ... చేనేత ఔన్నత్యాన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ఆదరించాలని కోరారు. అగ్గిపెట్టలో సైతం ఇమిడిపోయే చీరను తయారు చేసిన అద్భుత నైపుణ్యం మన నేతన్నల సొంతమని అన్నారు. మంత్రి నారా లోకేష్‌కు చేనేతలపై పూర్తి అవగాహన ఉందని వారిని అన్ని విధాలా ఆదుకునేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు.
ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ , తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్ , ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా, చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు వనజ, యూనియన్ బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ జవహర్, ఎల్ డి యం మహిపాల్ రెడ్డి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు కారంపూడి అంకమ్మరావు, పోట్లబత్తుని లక్ష్మణరావు, చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా కార్యాచరణ

● మాస్టర్ ప్లాన్ల ప్రకారం అభివృద్ధి పనులు చేపట్టాలి ● పేదరిక నిర్మూలన, సుస్థిర జీవనోపాధి కల్పన, నైపుణ్యాల పెంపుపై దృష్టిపెట్టాలి ● సామాజిక ఆస్తుల సృష్టిలో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ కీలకం ● జిల్లా కలెక్టర్ డా. జి.సృజన





**విజయవాడ, జర్నలిస్ట్ ఫైల్ :** రాష్ట్ర సమగ్రాభివృద్ధికి సంబంధించి గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి దార్శనికతకు అనుగుణంగా జిల్లాలో అన్ని శాఖల అధికారుల కార్యాచరణ ఉండాలని కలెక్టర్ డా. జి.సృజన స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టర్ సృజన.. జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా, డీఆర్వో వి.శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. సోమవారం గౌరవ ముఖ్యమంత్రి నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో చర్చించిన కీలక అంశాలతో పాటు గౌరవ ముఖ్యమంత్రి, గౌరవ ఉప ముఖ్యమంత్రి చేసిన సూచనలను కలెక్టర్ వివరించారు. వ్యవసాయం, అనుబంధ రంగాలుబీ పరిశ్రమలు, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్య ఆరోగ్యం, సహజ వనరులు, సంక్షేమం, గృహ నిర్మాణం.. ఇలా శాఖల వారీగా పవర్ పాయింట్ ప్రజంటేషన్‌తో భవిష్యత్తు ప్రణాళికను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సృజన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతలపై స్పష్టమైన అవగాహన పెంపొందించుకొని అధికారులు సమన్వయంతో, క్షేత్రస్థాయి అధికారులకు సరైన మార్గనిర్దేశనం చేస్తూ లక్ష్యాలను చేరుకునేందుకు కృషిచేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు సమీక్షలు, తనిఖీలు నిర్వహిస్తూ చేపట్టిన పనిలో పురోగతి ఉండేలా చూడాలన్నారు. కార్యాలయ సేవలు, క్షేత్రస్థాయి సందర్శనలకు సమప్రాధాన్యమివ్వాలని సూచించారు. జీరో పావర్టీబీ సాంఘిక, భౌతిక మౌలిక వసతుల అభివృద్ధిబీ జనాభాలో యువశక్తి, జీవన సౌలభ్యం సంక్షేమ, అభివృద్ధి అంశాలతో రాష్ట్ర ప్రభుత్వం విజన్ ఆంధ్రాఏ2047 దార్శనిక ప్రణాళికను రూపొందిస్తోందని.. ఇందుకు జిల్లాపరంగా అవసరమైన నివేదికలతో సిద్ధంగా ఉండాలన్నారు. పేదల జీవన ప్రమాణాలను పెంచి, వారిని పేదరికం నుంచి దూరంచేసేలా ప్రభుత్వం పేదల సేవలో కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఒక్క పారిశ్రామిక రంగంలోనే కాకుండా వివిధ రంగాల్లో ఉద్యోగాల కల్పన, జీవనోపాధి సృష్టిపై దృష్టిసారించాలన్నారు. ప్రజా సంక్షేమం లక్ష్యంగా ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు, కార్యక్రమాలు నూరుశాతం ఫలితాలిచ్చేలా చూడాలన్నారు. గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో రహదారులు, డ్రెయిన్లు, తాగునీటి సరఫరా.. ఇలా ఏ పని చేపట్టినా మాస్టర్ ప్లాన్ ప్రకారం ఉండాలన్నారు. సామాజిక ఆస్తుల సృష్టిపై ప్రత్యేకంగా దృష్టిసారించాలన్నారు. గ్రామాల్లో అవసరాలకు అనుగుణంగా ఆధారంగా గ్రామ అభివృద్ధి ప్రణాళికల (వీడీపీ)ను వివిధ శాఖల అధికారులు సమన్వయంతో రూపొందించాలని.. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. మంచినీటి కుళాయిల కనెక్షన్లు, మరుగుదొడ్లు, వీధి దీపాలు, ఘన-ద్రవ వ్యర్థాల నిర్వహణ తదితరాలపై దృష్టిసారించాలన్నారు. శాఖల వారీగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషిచేయాలని.. ఆయా సూచీల్లో ప్రగతి కనబరచాలని సూచించారు. ఉపాధి హామీ పథకం అనుసంధానంతో ఉద్యాన పంటలు చేపట్టేలా, ఫామ్ పాండ్‌లను అభివృద్ధి చేసేలా చూడాలని కలెక్టర్ సృజన సూచించారు.

**ఈ-పంట బుకింగ్‌పై దృష్టిపెట్టాలి:** లక్ష్యాలకు అనుగుణంగా ఖరీఫ్-2024లో వివిధ పంటల సాగు విస్తీర్ణం ఉండేలా చూడాలని.. అదే విధంగా ఈ ఏడాది సెప్టెంబర్ 15 నాటికి ఈ-పంట బుకింగ్‌ను పూర్తిచేయాల్సి ఉన్నందున అందుకు తగిన కార్యాచరణతో ముందుకెళాలని సూచించారు. 100 శాతం సీసీఆర్సీ కార్డులు పంపిణీని పూర్తి చేయాలని, రుణాలు అందేలా చూడాలన్నారు. భూసార పరీక్షలను పెంచాలని.. సాగు ఖర్చును తగ్గించుకొని దిగుబడులు పెరిగేందుకు రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు చేయాలన్నారు. పాఠశాలల్లో స్థూల నమోదు నిష్పత్తి (జీఈఆర్) పెంపునకు కృషిచేయాలన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ సాధించాల్సిన లక్ష్యాలతో పాటు ప్రకృతి వ్యవసాయం, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతలో నైపుణ్యాల పెంపు, ధరల నియంత్రణ, గృహ నిర్మాణ లక్ష్యాలు తదితరాలపై కలెక్టర్ సృజన గౌరవ ముఖ్యమంత్రి సూచనలకు అనుగుణంగా మార్గనిర్దేశనం చేశారు. సమావేశంలో పౌర సరఫరాల డీఎం జి.వెంకటేశ్వర్లు, కేఆర్సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఇ.కిరణ్మయి, సీపీవో వై.శ్రీలత, డ్వామా పీడీ జె.సునీత, డీపీవో ఎన్వీ శివప్రసాద్‌యాదవ్, డీఈవో యూవీ సుబ్బారావు, డీఎస్వో జి.మోహన్‌బాబు, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, పరిశ్రమల అధికారి ఎ.సుధాకర్, హౌసింగ్ పీడీ రజనీ కుమారి, జిల్లా వ్యవసాయ అధికారి సాకా నాగమణెమ్మ, ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్, ఏపీ ఎంఐపీ పీడీ పి.ఎం.సుభానీ, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# పొలిటికల్ గవర్నెన్స్ కు శ్రీకారం

● భద్రత పెంచాలని జగన్ అడుగుతున్నారు ● జగన్ నుండి భద్రత కావాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు ● క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు ● ఐదేళ్ల తర్వాత రాష్ట్రంలో ప్రజాస్వామ్య బద్ధమైన పాలన నడుస్తోంది ● అరాచకాలు సాగడం లేదనే పేర్ని నాని సహా వైసీపీ నేతల ఏడుపు ● ముఖ్యమంత్రి వ్యాఖ్యల్ని కూడా వక్రీకరిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి ● రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు & ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర



**అమరావతి, జర్నలిస్ట్ ఫైల్ :** ఐదేళ్ల తర్వాత ప్రజాస్వామ్య బద్ధంగా నడుస్తున్న పాలన చూసి వైసీపీ నేతలు నిద్ర లేని రాత్రులు గడుపుతున్నారు. అందుకే రెడ్ బుక్ పేరుతో పిచ్చి పిచ్చి వ్యాఖ్యలు చేస్తున్నారని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు & ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. సచివాలయానికి వస్తూ మధ్యలో మీడియాతో మాట్లాడారు. జగన్ రెడ్డి పాలనంతా దోచుకోవడం, దాచుకోవడం, ఖజానా నింపుకోవడానికే ప్రాధాన్యమిచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ఎలా రాళ్లు వేయాలా అనే ఆలోచన తప్ప సహకరించాలనే కనీస ఆలోచన కూడా వారు చేసింది లేదు. ఐదేళ్లుగా అరాచకాలకు పాల్పడిన జగన్ రెడ్డి ముఠా ఎక్కడ దాక్కున్నా వదిలి పెట్టేదే లేదు. అందరినీ వెతుక్కుని వచ్చి చట్ట ప్రకారం శిక్షించి తీరుతాం.

**ప్రజాస్వామ్య పాలన చూసి ఏడుపెందుకు..** ప్రజలకు ప్రజాస్వామ్యబద్ధమైన పాలన అందించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే.. జగన్ రెడ్డి రాళ్లేయాలనుకుంటున్నాడని మండిపడ్డారు. మంత్రులందరికీ గ్రూప్ పెట్టి, సమస్యలపై చర్చిస్తుంటే.. దానికి కూడా వక్రభాష్యం చెప్పడానికి సిగ్గుపడాలన్నారు. ఐదేళ్ల పాటు కనీసం ప్రజా సమస్యలపై చర్చించని వారికి ఇలాంటి పాలన చూస్తే ఏడుపు తప్ప ఇంకేముంటుందన్నారు. గతంలో వాట్సప్ అంటే ఏం చేశారో ఒక ఎంపీ నిరూపించాడు. వారి బుద్ధి అంత వరకే ఉంటుం దని బందరు పిచ్చోడు మరోసారి నిరూపించాడు. ప్రజల అభిప్రాయా లు, వారి సమస్యలు తెలిపేందుకు సత్వర మార్గంగా ఏర్పాటు చేసిన వ్యవస్థ గురించి మాట్లాడే అర్హత వారికి ఉందా అని ప్రశ్నించారు.

**ప్రజలకు సత్వర న్యాయం చేసేలా పొలిటికల్ గవర్నెన్స్..** ప్రజలకు సత్వర న్యాయం అందించే లక్ష్యంతో త్వరలోనే పొలిటికల్ గవర్నెన్స్‌కు శ్రీకారం చుట్టబోతున్నామన్నారు. ముఖ్యమంత్రి స్థాయికి తీసుకెళ్లే సమస్యకు అక్కడ వరకు తీసుకెళ్లే బాధ్యత ప్రజాప్రతినిధులకు అప్పగిస్తాం. అధికారుల వద్దకు తీసుకెళ్ల లేని సమస్యల్ని స్థానిక ప్రజాప్రతినిధులు పరిష్కరిస్తారు. గత ఐదేళ్ల పాలనలో అధికారులు కూడా బిక్కు బిక్కు మంటూ గడపాల్సి వచ్చింది. కానీ, అధికారులు స్వేచ్ఛగా పని చేసేలా, వారి అభిప్రాయాలు పంచుకునేలా వ్యవస్థల్ని మెరుగుపరుస్తాం.

**బందరు పిచ్చోడికి రక్త కన్నీరే..** బందరు పిచ్చోడు పేర్ని నానికి రెడ్ బుక్ పవర్ ఏంటో తెలిసినట్లుంది. తప్పులు బయటపడితే శిక్ష తప్పదనే భయంతో ఏదేదో వాగుతున్నాడు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి చేస్తే.. ఆత్మరక్షణ కోసం చేశారని చెప్పడానికి సిగ్గుపడాలి. కొడాలి నాని, వల్లభనేని వంశీని వెనకేసుకొస్తున్న పేర్ని నాని వారిని దాచిపెట్టింది కూడా నువ్వేనా దాచింది నువ్వేనా? బంద రులో ఉండాలంటే నాని వణుకుతున్నాడు. చీకట్లో వచ్చి చీకట్లోనే పారిపోతున్నాడు. పేర్ని నాని ఐదేళ్ల అరాచకాలు, అక్రమాలన్నీ బయటపెడతాం. భూ కబ్జాలు, కొడుకుతో నడిపించిన గంజాయి దందా ప్రజల ముందు ఉంచుతాం. జగన్ రెడ్డి, వైసీపీ నేతల ఐదేళ్ల పాపాలను ప్రజలు గమనించారు కాబట్టే చిత్తుచిత్తుగా ఓడించారు. పేర్ని నానిని 50 వేలకుపైగా తేడాతో చిత్తు చేశారు. ఇప్పటికైనా పేర్ని నాని ఒళ్లు దగ్గర పెట్టుకోకుంటే ప్రజలే తిరుగుబాటు చేస్తారు.

**జగన్ ఫేక్ బతుక్కి సమాధి కడతాం..** శవం దొరికితే తప్ప రాష్ట్రానికి రాను అనే పరిస్థితిలో జగన్ రెడ్డి ఉన్నాడు. తనకు భద్రత పెంచాలని జగన్ రెడ్డి అడుతున్నారు. కానీ.. జగన్ రెడ్డి నుండి రక్షణ కావాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల ఫలితాల రోజునే సగం మంది వైసీపీ నేతలు రాష్ట్రం వదిలి పారిపోయారు. అలాంటి వారిని శిక్షించడానికి రెడ్ బుక్ అవసరం లేదు. ప్రజల్లోకి వస్తే వారే తన్ని తరిమేస్తారు. పేర్ని నానిని తెలంగాణలో తరిమితరిమి కొట్టారు. అదే విధంగా ఇక్కడా తన్ని తరిమేసే రోజు వస్తుంది. ప్రజలు ఈడ్చి తన్నినా జగన్ రెడ్డి ఇంకా ఫేక్ రాజకీయాలే చేస్తున్నాడు. కట్ కాపీ పేస్ట్ తో ఫేక్ వార్తలు సృష్టిస్తున్నాడు. అలీ బాబా అరడజను దొంగల ముఠాను వెంటేసుకుని రాష్ట్రంలో అశాంతి నెలకొల్పేందుకు కుట్రలు చేస్తున్నాడు. జగన్ రెడ్డి ఫేక్ రాజకీయాలు మానుకోకుంటే అడ్రస్ గల్లంతు కావడం తథ్యం.

# హెచ్ఐవీ/ఎయిడ్స్ వ్యాధి నివారణే ధ్యేయంగా ముందుకు సాగుదాం..

● ఈ నెల 12 నుండి 2 నెలల పాటు అవగాహన సదస్సులు ● 18లైన్ డిపార్ట్ మెంట్ ల సహకారంతో రాష్ట్రంలో హెచ్ఐవీ వ్యాప్తి శాతం జీరో లక్ష్యంగా పనిచేద్దాం. ● దేశంలో వ్యాధి విస్తరణను సమర్థవంతంగా అడ్డుకోవడంలో మన రాష్ట్రం 2వ స్థానంలో ఉంది ● హెచ్ఐవీ సోకినా మందులు వాడుతూ సాధారణ జీవనం సాగించవచ్చు. ● వ్యాధిగ్రస్థులపై వివక్ష చూపడం మంచి పద్ధతి కాదు.



**విజయవాడ, జర్నలిస్ట్ ఫైల్:** హెచ్ఐవీ/ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తిపై సమాజంలో అవగాహన పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ(ఏపీశాక్స్) ఏపీడీ డాక్టర్ సరస్వతి అన్నారు. మన రాష్ట్రం నుండి పూర్తిగా వ్యాధిని తరిమివేసేవరకు మనం విశ్రమించకూడదని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ వారి ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ శాఖలతో రాష్ట్ర స్థాయి జాయింట్ వర్కింగ్ గ్రూప్ కమిటీ సమావేశం విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్ లో మంగళవారం నిర్వహించారు. సమావేశానికి ఐఈసీ జేడీ డాక్టర్ మంజుల అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సరస్వతి మాట్లాడుతూ హెచ్ఐవీ/ఎయిడ్స్ పై ప్రజలకు అవగాహన కల్పించడానికి వివిధ ప్రభుత్వ శాఖల యొక్క బాధ్యతను మరియు వారి సహకారం కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. వంద మంది కన్నా ఎక్కువ సంఖ్యలో పనిచేస్తున్న సంస్థల్లో ఒక కంప్లైంట్ అధికారిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. హెచ్ఐవీ పరీక్షలు ప్రతి ఒక్కరూ చేయించుకోవాలని, అందరూ ముందుకు రావాలని డాక్టర్ సరస్వతి కోరారు. ఈ నెల 12 నుండి 2 నెలల పాటు దేశవ్యాప్త పిలుపులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా హెచ్ఐవీ/ఎయిడ్స్ పై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. అవగాహన సదస్సుల నిర్వహణలో 18లైన్ డిపార్ట్ మెంట్ లు సహకారం అందించడానికి ముందుక రావడం హర్షనీయమన్నారు. అందరి సహకారంతో 2030 నాటికి వ్యాధి వ్యాప్తి జీరో పర్సంటేజ్ సాధించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుదామన్నారు. ప్రతి ఒక్కరూ వ్యాధిపై అవగాహన పెంచుకోవడటంతో కొత్తగా నమోదవుతున్న కేసుల సంఖ్య అతి తక్కువగా నమోదవుతున్నాయని, ఇక అత్యుత్తమ మందులు ఉచితంగా పంపిణీ చేయడంతో పాటు వాటిని క్రమం తప్పకుండ వాడే విధంగా వారిలో చైతన్యం కలిగించడంలో విజయం సాధించడంతో రాష్ట్రంలో వ్యాధి తీవ్రతతో మృతి చెందే వారి సంఖ్య తగ్గిపోయిందని, ఇది అభినందించదగ్గ విషయమని డాక్టర్ సరస్వతి అన్నారు. ఐఈసీ, జేడీ డాక్టర్ మంజుల మాట్లాడుతూ ప్రతి జిల్లాలో ఒక అంబుడ్స్ మెన్ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అందులో డిఎం అండ్ హెచ్ వో అంబుడ్స్ మెన్ గా ఉంటారని తెలిపారు. రాష్ట్ర స్థాయి ఇన్‌టెన్సిఫైడ్ క్యాంపెయిన్ ప్రోగ్రాంను ఈ నెల 12న వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. దీంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఈ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. ఇలా 2 నెలల పాటు అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. మొదటి వారం హెచ్ఐవీ సంక్రమించే మార్గాలు, నివారణ చర్యలు, 2వ వారం హెచ్ఐవీపై అనుమానాలు, అపోహలు, 3వ వారం హెచ్ఐవీ సంక్రమించే రిస్క్ అవగాహన మరియు సేవల ప్రచారం, 4వ వారం జాతీయ టోల్ ఫ్రీ ఎయిడ్స్ హెల్ప్ లైన్ -1097పై అవగాహన, 5వ వారం కండోమ్ మరియు సురక్షిత లైంగిక అలవాట్లపై ప్రచారం, 6వ వారం ఎస్టీఐ నివారణ మరియు చికిత్స, 7వ వారం మద్యపానం మరియు మాదకద్రవ్యాల దుర్వినియోగం, 8వ వారం స్టిగ్మా మరియు వివక్షపై రాష్ట్రవాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తామని వివరించరు. వ్యాధి సంక్రమించిన తరువాత పూర్తిగా నయం చేయడం సాధ్యం కాదు కాని ట్రీట్ మెంట్ తో సాధారణ జీవనం మాత్రం సాధ్యమేమన్నారు. రాష్ట్రంలో 96 ఎన్జీవో సంస్థలు ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించి వారిని చైతన్య పరుస్తున్నాయని చెప్పారు. వ్యాధి ఉన్న గర్భిణీ నుండి బిడ్డకు ఈ వైరస్ సంక్రమించకుండ వైద్యుల సూచనలు, సలహాలతో ఆరోగ్యవంతమైన బిడ్డ కు జన్మనివ్వవచ్చన్నారు. కార్యక్రమంలో భాగంగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా రాష్ట్రంలో వ్యాధి ప్రభలకుండ తీసుకుంటున్న చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జేడీ డాక్టర్ భాగ్యలక్ష్మీ, డాక్టర్ కామేశ్వర ప్రసాద్, డాక్టర్ చక్రవర్తి, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, జె. ఎస్తేర్ తంబురాజ్, ఎం. శ్రీనివాసరావు, రాజేష్ కుమార్, ఎ.ఎస్. రేణుక, బి. వినయ్ కుమార్, జి. మంగమ్మ, ఎస్ కె రహనా బేగం, పి. వెంకట్, డాక్టర్ జయకృష్ణ, డాక్టర్ నిర్మలా గ్లోరీ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో అక్రమంగా ఇసుక రవాణా జరక్కుండా కట్టుదిట్టమైన చర్యలు - జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



**మచిలీపట్నం, జర్నలిస్ట్ ఫైల్:** జిల్లాలో ఎక్కడ కూడా అక్రమంగా ఇసుక రవాణా జరక్కుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు మంగళవారం ఉదయం నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఇసుక అక్రమంగా రవాణా కాకుండా నిరోధించాలన్నారు. ఇసుక రీచ్ లలో గట్టిగా నిఘా ఉంచి ఇసుక అక్రమంగా రవాణా కాకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలన్నారు. ఇందులో భాగంగా గుర్తించిన 26 ప్రదేశాల్లో సీసీటీవీ లను అమర్చేందుకు రూట్ మ్యాప్ సిద్ధం చేసి అందజేయాలన్నారు మద్దూరులో సీజ్ చేసిన 1500 టన్నుల ఇసుక బయటకు తరలిపోకుండా ఎస్ ఈ బి అధికారులు అక్కడ సీసీటీవీ లను అమర్చి అందుకు సంబంధించిన బిల్లును చెల్లింపు కోసం అందజేయాలన్నారు. అనుమతి లభించిన 8 ఇసుక రీచులలో రానున్న వర్షా కాలం లో చేతులతో (మాన్యువల్ గా) ఇసుక తీసుకోవడానికి గానీ లేదా కన్వేయర్ బెల్ట్ ద్వారా టిప్పర్లోకి లోడింగ్ చేయడానికి క్షేత్రస్థాయిలో సాధ్యాసాధ్యాలను పరిశీలించి నివేదిక అందజేయాలన్నారు. కొత్తగా గుర్తించిన 5 రీచ్ లలో 14 లక్షల టన్నుల వరకు ఇసుక ఉండే అవకాశం ఉందని, అక్కడ సెమీ మెకనైజ్డ్ (కొంతవరకు యంత్రాలతో) ఇసుక తవ్వడానికి గనులు, జలవనరులు, రెవెన్యూ, ఆర్డబ్ల్యూఎస్, ఎస్ ఇ బి, భూగర్భజల శాఖల అధికారులు ఉమ్మడిగా తనిఖీ చేసి ప్రజల అభిప్రాయం తెలుసుకొని పూర్తి సిఫారసులతో వచ్చే సమావేశానికి నివేదిక తీసుకుని రావాలన్నారు. ఈనెల 9వ తేదీన మరల సమీక్ష సమావేశం నిర్వహిస్తామని ఆ తేదీన కోరిన నివేదికలు పూర్తిస్థాయిలో అందజేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ, జిల్లా గనులు భూగర్భ శాఖ అధికారి కొండారెడ్డి, ఎస్ ఈ బి సూపరింటెండెంట్లు జి గంగాధర్ రావు, పాండురంగారావు, ఇన్స్పెక్టర్లు వెంకటలక్ష్మి, శివరామరాజు, హేమ సుస్మిత, డిపిఓ నాగేశ్వర్ నాయక్,కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ పి శ్రీనివాసరావు, భూగర్భ జల శాఖ అధికారి విజయవర్ధన్ రావు, జల వనరుల శాఖ ఈ కృష్ణారావు, ఎంవిఐ స్వర్ణ శ్రీనివాసు, ఎస్ వి ఎన్విరో ల్యాబ్స్ కన్సల్టెంట్లు సునీల్, కృష్ణ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రైతులు సాగు చేస్తున్న ప్రతి పంట ఈ క్రాప్ నమోదు చేయాలి - జిల్లా కలెక్టర్





**మచిలీపట్నం, జర్నలిస్ట్ ఫైల్:** జిల్లాలో ఈ క్రాప్ నమోదు పకడ్బందీగా నిర్వహించాలని, రైతులు సాగు చేస్తున్న ప్రతి పంట ఈ క్రాప్ లో నమోదు కావాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్ నుండి తాసిల్దారులు మండల వ్యవసాయ ఉద్యాన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఈక్రాప్ నమోదు కార్యక్రమం పై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు పంట సాయం, ఇన్పుట్ సబ్సిడీ, పంటల బీమా వంటి ప్రభుత్వ పథకాలు అందాలంటే ఈక్రాప్ డేటా చాలా ముఖ్యం అన్నారు. అందువల్ల ఈ క్రాప్ నమోదు జిల్లాలో పకడ్బందీగా చేపట్టాలన్నారు. తూతూ మంత్రంగా చేయడం, పంట లేకుండా ఉందని, పండించే పంట బదులు మరో పంట నమోదు, విస్తీర్ణంలో తప్పులు దొర్లితే సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. చేసిన ఈక్రాప్ డేటా పై సూపర్ చెక్ ఉంటుందన్నారు. తాసిల్దారు, ఆర్డిఓ, కలెక్టర్ స్థాయిలో ఈ క్రాప్ డేటా వెరిఫికేషన్ సీరియస్ గా జరుగుతుందన్నారు. పండించే పంట వద్దకు వెళ్లి జియో రిఫరెన్సింగ్ తీసుకోవాల్సి ఉంటుందన్నారు. గ్రామ వ్యవసాయ సిబ్బంది వీఆర్వో అదీకృతం జరగాలన్నారు. ఈ క్రాప్ నమోదు అయ్యాక రైతుల ఈ కేవైసీ చేయాలని అన్నారు. మామిడి వంటి పంటలు సాగు చేస్తున్న భూ యజమానులు వేరే ప్రాంతాల్లో ఉంటారని, వీరికి కూడా ఈక్రాప్ నమోదు తప్పనిసరిగా చేయాల్సి ఉంటుందని, కావున ముందుగానే ఇలాంటి జాబితా సిద్ధం చేసుకుని వీరి నమోదుపై దృష్టి పెట్టాలని అన్నారు. కౌలు రైతులకు సి సి ఆర్ సి కార్డుల జారీ సంబంధించి గత ఏడాది జిల్లాలో 57 వేల వరకు జారీ చేయగా, ఈ ఏడాది 70 వేల లక్ష్యాన్ని చేరుకోవలసి ఉందన్నారు. గత ఏడాది సిసిఆర్సి జారీ చేసిన రైతులలో చాలావరకు రెన్యువల్ చేయవచ్చని, ఈసారి కొత్తగా ఇవ్వాల్సిన రైతులపై దృష్టి పెట్టాలన్నారు. కౌలు రైతులకు జారీ చేస్తున్న సిసిఆర్సి కార్డుల ప్రయోజనాల పట్ల భూ యజమానులకు తగిన అవగాహన కల్పించాలని, ముఖ్యంగా భూ యజమానుల అంగీకారం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ పద్మావతి, వ్యవసాయ శాఖ డిడి మనోహర్, ఏడి లు పాల్గొన్నారు

# నూజివీడు నియోజకవర్గంలో గత సంవత్సరం కన్నా 3రెట్లు పెరిగిన సభ్యత్వ నమోదు - సమన్వయకర్త బర్మాఫణి బాబు



**నూజివీడు, జర్నలిస్ట్ ఫైల్ :** ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గం లో జనసేన పార్టీ అధిష్టానం తలపెట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమం సోమవారంతో ముగిసిందని నూజివీడు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బర్మా ఫణి బాబు అన్నారు. 2023 సభ్యత్వ నమోదు కన్నా మూడు రెట్లు అధికంగా నూజివీడు నియోజకవర్గంలోని జనసేన పార్టీ నాయకులు ,కార్యకర్తలు ,వీర మహిళలు ఎంతో కష్టపడి వాలంటీర్ల ద్వారా 4వేలకు పైగా సభ్యత్వ నమోదు చేసినట్లు బర్మా ఫణి బాబు అన్నారు.. నూజివీడు నియోజకవర్గంలో పాశం నాగబాబు 730 సభ్యత్వాలతో మొదటి స్థానంలో ఉన్నట్లు అలాగే నూజివీడు నియోజకవర్గంలో 50 మందికి పైగా సభ్యత్వాలు నమోదు చేసే వాలంటీర్ గా పనిచేశారని ఈ సందర్భంగా ప్రతి ఒక్క వాలంటీర్ కి బర్మా ఫణి బాబు అభినందనలు తెలిపారు.. వచ్చే సంవత్సరం నాటికి మరింత సభ్యత్వాలు చేసి జిల్లాలోనే మొదటి స్థానంలో నూజివీడు నియోజకవర్గ సభ్యత్వాలు ఉండేలా కృషి చేస్తామని బర్మా ఫణి బాబు తెలిపారు..

# తండ్రికి తగ్గ తనయుడు

● తండ్రి శాసనమండలి చైర్మన్ ● తనయుడు ఐపిఎస్







**భీమవరం, జర్నలిస్ట్ ఫైల్ :** తండ్రి చట్టాలు చేస్తే తనయుడు వాటిని అమలు చేసే శాఖకు ఎంపికయ్యారు. శాసన మండలికి మూడు ప్రధాన విధులను కలిగి ఉంటుంది. చట్టాలను రూపొందించడం, ప్రభుత్వ వ్యయాన్ని ఆమోదించడం మరియు ప్రభుత్వ పనిని పర్యవేక్షించడం . భారత రాజ్యాంగం ప్రకారం శాసన మండలికి పరిమిత అధికారాలు ఉన్నాయి. వివరాల్లోకి వెళ్ళితే అటువంటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు చట్టసభల్లో చట్టాలు చేస్తుంటే తనయుడు కొయ్యే చిట్టి రాజు తనదైన శైలిలో ఉన్నత విద్యను అభ్యసించి ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్) కు ఎంపికయ్యారు. సివిల్స్ లో 833 ర్యాంకు సాధించిన ఆయనకు ఐపీఎస్ ను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. చిట్టి రాజు ఆగస్టు 26న ట్రైనింగ్ కు ముస్సోరి బయలుదేరి వెళ్ళనున్నారు. ఈ సందర్భంగా చిట్టి రాజు మాట్లాడుతూ తన తండ్రి మోషన్ రాజు నిత్యం ప్రజా సేవలో ఉండటం చూసి ప్రజలకు తన సేవలు అందించాలనే తలంపుతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా పశ్చిమగోదావరి జిల్లా పూర్వపు కలెక్టర్ లవ్ అగర్వాల్, జిల్లా నుంచి ఐఏఎస్ అధికారిగా ఎదిగిన రేవు ముత్యాలరాజు ఇరువురిని ఆదర్శంగా తీసుకుని సివిల్స్ వైపు వెళ్లినట్లు వివరించారు.

# గుడివాడ ట్రాఫిక్ ఎస్ఐగా ప్రసాదరావు



గుడివాడ, జర్నలిస్ట్ ఫైల్ : గుడివాడ ట్రాఫిక్ ఎస్.ఐ ప్రసాదరావు భాద్యతలు స్వీకరించారు. మంగళవారం స్థానిక డియస్పి కార్యాలయంలో ఈ మేరకు ట్రాఫిక్ ఎస్.ఐగా ప్రసాదరావు భాద్యలు స్వీకరించిన అనతరం గుడివాడ డియస్పి శ్రీకాంత్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

# రైతులు అధిక దిగుబడుల కోసం పొలంబడిని సద్వినియోగం చేసుకోండి



గుడివాడ, జర్నలిస్ట్ ఫైల్ :మేలైన వ్యవసాయ పద్ధతులను అనుసరించి అధిక దిగుబడులను పొందేలా రైతుల కోసం గ్యాప్ పొలంబడి కార్యక్రమాన్ని గుడివాడ డివిజన్‌లో నిర్వహించడం జరుగుతుందని వ్యవసాయశాఖ ఏడిఓ రమాదేవి అన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో రమాదేవి విలేకర్లుతో మాట్లాడుతూ అధిక దిగుబడులు పొందేందుకు నందివాడ పెద్ద పారుపూడి మండలాలలో 14 వారాలపాటు రైతులకు, నిపుణులతో శిక్షణా తరగతులు కార్యక్రమాన్ని నిర్వహించి ఉత్తమ రైతులకు సర్టిఫికెట్లను కూడా అందించడం జరుగుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# చేనేత వస్త్ర ధారణ పోటీలో బహుమతులు ప్రదానం



విజయవాడ, జర్నలిస్ట్ ఫైల్ : భారతీయజనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీమతి దగ్గుబాటి పురందేశ్వరిగారు మరియు జాతీయ మహిళా మోర్చా అధ్యక్షురాలు వనితా శ్రీనివాసన్ ఆదేశాల మేరకు బిజెపి రాష్ట్ర మోర్చా అధ్యక్షులు నిర్మళా కిషోర్ గారి పిలుపు మేరకు ఎన్టీఆర్ జిల్లా మహిళా మోర్చా అధ్వర్యంలోజాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఉదయం 11 గంటలకు విజయవాడ గాంధీజీ మున్సిపల్ కళాశాలలో చేనేత వస్త్రధారణ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ఇవ్వడం జరింగింది.ఈ కార్యక్రమంలో %చీ=% జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ ముఖ్య అతిథిగా పాల్గొని కళాశాల విద్యార్థినులకు చేనేత వస్త్రాల ఆవస్యకతను వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో గాంధీజీ మున్సిపల్ కళాశాల చైర్మెన్ కొత్తమాసు పిచ్చయ్య,ఎన్టీఆర్ జిల్లా మహిళామోర్చా అధ్యక్షురాలు యర్రా సునితా బిజెపి రాష్ట్ర మహిళా నాయకురాళ్ళు చిగురుపాటి లక్ష్మి,సుజాత ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షురాలు రత్నకుమారి,ఎన్టీఆర్ జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు సాయి మరియు శాంతి,బుల్లబ్బాయి,రవి తదితరులు పాల్గొన్నారు.

# నారాయణ దంత వైద్య సేవలు అభినందనీయం.




నెల్లూరు,, జర్నలిస్ట్ ఫైల్ : గ్రామీణ ప్రాంత ప్రజల దంతాల రక్షణలో నారాయణ దంత వైద్య సేవలు ఎంతో అభినందనీయమని 25వ డివిజన్ కార్పొరేటర్ బద్దిపూడి నరసింహగిరి అన్నారు. మంగళవారం, ఓరల్ హైజిన్ డే సందర్భముగా, బుజబుజ నెల్లూరు, శివాజీ కాలనీలోని ఎంపీపీ స్కూల్ నందు నారాయణ డెంటల్ హాస్పిటల్, కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం జరిగినది. ఈ శిబిరంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నా నరసింహగిరి మాట్లాడుతూ గత 24 సంవత్సరములుగా నెల్లూరు జిల్లాతో పాటు పరిసర ప్రాంత వాసులకు దంత వైద్య రంగంలో విశిష్ట వైద్య సేవలు అందిస్తూ, గ్రామీణ ప్రాంత ప్రజల దంత సంరక్షణలో నారాయణ దంత వైద్య సేవలు ఎంతో అభినందనీయమని కొనియాడారు, ఆహారం నమిలి మింగాలన్న, మాటలు స్పష్టంగా రావాలన్నా, భావాన్ని వ్యక్తపరచాలన్నా, దంతాలు ఆరోగ్యంగా ఉండడం చాలా అవసరం అని, దంతాల సంరక్షణ కొరకు ఉచిత దంత వైద్య శిబిరాలు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు, ఈ శిబిరంలో నోరు మరియు దంత సమస్యలు ఉన్నవారికి పరీక్షించి, దంత సమస్యలను గుర్తించి, అవసరమైతే నారాయణ డెంటల్ హాస్పిటల్ నందు వైద్య చికిత్సలు అందించగలరని, ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగపరచుకోవాలని కోరారు. జిల్లా పీ.హెచ్.పీ అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ శిబిరంలో పిప్పి పంటికి సిమెంట్ పెట్టడం, గార పట్టిన పళ్ళను శుభ్రం చేయడం, కదిలిన మరియు పుచ్చిన పంటిని తొలగించడం జరుగుతుందని, మరింత మెరుగైన వైద్యం కొరకు నారాయణ దంత హాస్పిటల్ కి తీసుకుని వెళ్లి వైద్యం అందించగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టాప్ ప్రొఫెసర్ డా. ప్రతిమ, డా. మనోజ్ఞ, డా. సుప్రియ వైద్య సేవలు అందించారు. దొడ్డక రమేష్, పిఆర్ఓ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## గుడివాడ కంకిపాడు రహదారిని త్వరలోనే

# అభివృద్ధి చేస్తాం-ఎమ్మెల్యే వెనిగండ్ల..



గుడివాడ, జర్నలిస్ట్ ఫైల్ : గుడివాడ కంకిపాడు రహదారి అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలోని ప్రజావేదికలో ఆర్‌అండ్‌బి అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆర్‌అండ్‌బి అధికారలతో సమావేశంలో అయన మాట్లాడుతూ గుడివాడ నియోజకవర్గ పరిధిలోని ప్రధాన రహదారుల్లో ఉన్న గుంటలను పూడ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలో వివిధ రహదారుల అభివృద్ధి, మరమ్మత్తులు చేయాలన్నారు. ప్రత్యేకంగా ఏఎన్ఆర్ కళాశాల నుండి వెంట్రప్రగడ వరకు ఐదు కోట్ల నిధులతో రివిట్ మెంట్‌తో సహా రహదారిని అభివృద్ధి చేస్తామన్నారు. వెంట్ర ప్రగడ నుండి నందమూరు వరకు రహదారి మరమ్మతులకు టెండర్లు పిలిచినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని రహదారుల అభివృద్ధికి ఎన్ఆర్‌జిఎస్ నిధులతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులతో ప్రధాన రహదారులను కూడా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రస్తుత వర్షాకాలం దృష్ట్యా ప్రజలు ఇబ్బంది పడకూడదనే ప్రధాన రహదారుల్లో గోతులను పూడుస్తు చిన్నపాటి మరమ్మత్తులు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గుడివాడ బైపాస్ రోడ్డును నేషనల్ హైవేలో విలీనం చేయాలని ప్రతిపాదనలు రూపొందించామని, కేంద్రమంత్రి గడ్కరీ విదేశీ పర్యటన ముగించుకొని వచ్చిన వెంటనే ఎంపి వల్లభనేని బాలసౌరి సహకారంతో రహదారి విలీన ప్రక్రియ పూర్తవుతుందన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు,ఆర్ అండ్ బి శాఖ ఇఇ శ్రీనివాసరావు, డిఇ కామేశ్వరరావు, పలువురు ఎఇ లు పాల్గొన్నారు.

# రైతులను మోసం చేసి, వారి ధాన్యాన్ని దొంగిలించిన వారిపై చర్యలు చేపట్టాలి.

## రైతులకు న్యాయం చేయాలని డిఆర్ఓ లవన్నను కోరిన సిపిఐ.



నెల్లూరు, జర్నలిస్ట్ ఫైల్ : రైతులను మోసం చేసి వారి ధాన్యాన్ని బంధించిన వారి మీద చట్టరీత్యా తగల చర్యలు చేపట్టాలని సిపిఐ నగర్ కార్యదర్శి అరిగెల సాయి డిమాండ్ చేశారు.సి. పి. ఐ ఆధ్వర్యంలో గాంధీ బొమ్మ సెంటర్ నుంచి నష్టపోయిన రైతులుతో కలపి భారీ ర్యాలీ గా కలెక్టర్ కార్యాలయము వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. అనంతరం సి. పి. ఐ నగర కార్యదర్శి అరిగెల శాయి మాట్లాడుతూ, నెల్లూరుజిల్లాలో దాదాపు 434 మంది రైతులు, 2200 పుట్లు వరి ధాన్యం దాదాపు నాలుగు కోట్ల 66 లక్షల 72 వేల రూపాయల విలువ చేసే వరి ధాన్యం శ్రీ సాయిబాబా రైస్ మిల్ యజమాని శ్రీరామ్ శేఖర్ బాబుకు అమ్మడం జరిగిందన్నారు. అయితే శ్రీరామ్ శేఖర్ బాబు వద్ద నుంచి మరి కొంతమంది రైతుల ధాన్యాన్ని దొంగిలించి,వారి వ్యక్తిగత మిల్లులో భద్రపరుచుకోవడం జరిగిందని ఆరోపించారు. దీని మీద రైతులు శ్రీరాం శేఖర్ బాబును నిలదీయగా తన వద్ద నుంచి మీ ధాన్యాన్ని అమరా విక్రం,పి.ఆర్.సుధాకర్, శ్రీధర్,రాజశేఖర్, శివ అను వ్యక్తులు దొంగిలించి భద్రపరుచుకోవడం జరిగిందని అతను చెప్పడం జరిగిందన్నారు.దీని మీద రైతులు పలుమార్లు,జిల్లా కలెక్టర్ , పోలీసు ఉన్నతాధికారులను, పౌరసరఫరాల శాఖ అధికారులను, మంత్రులను కలసి వారు గోడు విన్నపిం చుకున్నా పట్టించుకున్న నాథుడు లేదని రైతులు ఆవేదన చెందుతున్నారన్నారు.రైతుల ధాన్యాన్ని దొంగిలించిన వారి రైస్ మిల్లులలో ఇప్పటికి కూడా ధాన్యం నిల్వ ఉన్నదని, అధికారులు వెంటనే స్పందించి, తక్షణమే రైతుల ధాన్యాన్ని నిల్వ ఉంచి ఉన్న గోడౌన్లను సీజ్ చేయాలని కోరారు. శేఖర్ బాబు నుంచి ధాన్యాన్ని బలవంతంగా అపహరించిన వారి మీద దొంగతనం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.నెలల తరబడి ఎండనక, వాననక ఆరు బయట కష్టపడి చెమటోడ్చి పండించిన పంటను ,ఈ విధంగా రైస్ మిల్లర్లు దోచుకుంటుంటే, మేమేం చేయగలం అని చేతులెత్తేసిన అధికారుల పనితీరు హాస్యాస్పదం అని అన్నారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ వారు కూడా రైతులకు న్యాయం చేయాలని ఉద్దేశం లేకుండా , ఎంతసేపటికి ధాన్యాన్ని దొంగిలించిన ఆ 5గురిని కాపాడే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కాబట్టి తమరు మీకున్న అధికారాన్ని ఉపయోగించి రైతులకు న్యాయం చేసి, వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరుకుంటున్నామని డిఆర్ఓ ను కోరారు అన్నారు. అనంతరం మెమోరాండం ఇవ్వడానికి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించిగా,రైతులను లోపలకి పోలీసులు అనుమతించకపోగా,సి. పి. ఐ నాయకులు కలెక్టర్ కార్యాలయం లోపల బైటాయించడం తో. డి. ఆర్. ఓ లవన్న క్రిందకి దిగి వచ్చి, సి. పి. ఐ నాయకులతో చర్చించి, ధాన్యాన్ని దొంగిలించిన మిలర్ల మీద కేసులు నమోదు చేయించి, కలెక్టర్ తో మాట్లాడి దాన్యం నిల్వ ఉన్న గోడౌన్ లను సీజ్ చేయిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు.ఈ కార్యక్రమం లో సి. పి. ఐ నాయకులు వాటంబేటి నాగేంద్ర, పి. లీలమోహన్, స్టాలిన్, వనజ, రైతులు వెంకటేష్ కుమార్, నరసింహ, చరణ్, సాయి లత తదితరులు పాల్గొన్నారు.

# ఖాదర్ నవాజ్ ఖాన్ ఈద్గా జోలికొస్తే సహించం.

● ఆదాలను హెచ్చరించిన ఆషిక్ అలీ ఖాన్.



నెల్లూరు, జర్నలిస్ట్ ఫైల్ : నెల్లూరు రూరల్ పరిధిలోని కొత్తూరు రామకోటయ్య నగర్ ఖాదర్ నవాజ్ ఖాన్ ఈద్గా విషయంలో వైసీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గం ఇన్చార్జి ఆదాల ప్రభాకర్ రెడ్డి తన డ్రామాలు మానుకోవాలని టిడిపి మైనార్టీ నేత ఆశిక్ అలీ ఖాన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నెల్లూరు రూరల్ లోని కొత్తూరు ఖాదర్ నవాజ్ ఖాన్ ఈద్గా వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాదర్ నవాజ్ ఖాన్ ఈద్గా ను కబ్జా చేసేందుకు ఆదాల ప్రభాకర్ రెడ్డి రకరకాల కుయుక్తులకు పాల్పడుతున్నారని విమర్శించారు. తమ ఈద్గా జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఏటువంటి సంబంధం లేకపోయినా ఊరు, పేరు లేని ఓ చెంచా చేత రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పై అవాస్తవ ప్రచారాలు చేయించారని కానీ మైనార్టీలకు వాస్తవాలు తెలుసన్నారు.కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వ్యతిరేకించి బయటకు వచ్చిన 9 నెలలకు ఈద్గా స్థలాన్ని పెట్రోల్ బంక్ కోసం కేటాయించడం జరిగిందని అందుకు సంబంధించిన ఆధారాలను మీడియా మిత్రులకు చూపించారు. ఈద్గా చుట్టూ ప్రహరీ గోడకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆర్థిక సహాయం చేశారని కానీ ఏ రోజు చెప్పుకోలేదన్నారు. కానీ ఐదు లక్షలు సహాయం చేసిన ఆదాల ప్రభాకర్ రెడ్డి తన చెంచాల ద్వారా ప్రచారం చేసుకున్నారన్నారు. 5 లక్షలు కావాలంటే తాము భిక్షాటన చేసి ఆదాలకు తిరిగి ఇచ్చేస్తామన్నారు. ఈద్గా స్థలంలో పెట్రోల్ బంకు ఆదాల ప్రభాకర్ రెడ్డి రూరల్ ఇన్చార్జిగా ఉన్నప్పుడే ఇది జరిగిందన్నారు.తన అల్లుడు పెట్రోలు బంకు కోసం ఆదాల ఈద్గా స్థలాన్ని కాజేయాలని కుట్ర పన్నారన్నారు.సార్వత్రిక ఎన్నికల్లో కొత్తూరు పరిసర ప్రాంతాల్లో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి 2500 మెజారిటీ వచ్చిందని ఈ మెజార్టీ చూస్తేనే మైనార్టీలు ఆయనకు అండగా నిలబడ్డారని రుజువవుతుం దన్నారు. మైనార్టీ నేత జమీర్ మాట్లాడుతూ ఖాదర్ నవాజ్ ఖాన్ ఈద్గా స్థలం కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని చివరికి ప్రాణ త్యాగానికైనా సిద్ధమన్నారు. ఈద్గా కమిటీ సభ్యులు షఫీ, హాఫీజ్ , జనసేన నేత షాకీర్ రఫీ, మస్తాన్, బషీర్, రియాజ్ , ఖ య్యూం, హామీద్,కరిమల్లా, ఖాదర్ భాష , లియాఖత్ ఆలీ ఖాన్, అన్వర్, కరిముల్లా, మునీర్, తదితరులు పాల్గొన్నారు.

# అన్న క్యాంటీన్లు సిద్ధం..15న ప్రారంభానికి ఏర్పాట్లు

కర్నూలు,జర్నలిస్ట్ ఫైల్:పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లు సిద్ధమవుతున్నాయి. ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవం రోజున వీటిని ప్రారంభించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలోని ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటోంది. ఐదేళ్ల క్రితం టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లు పేదల ఆకలిని తీరుస్తూ అందరి మన్ననలు పొందాయి. అన్ని వర్గాల ప్రజలకు రుచికరమైన భోజనం అందిస్తూ అన్నక్యాంటీన్లు గుర్తింపు తెచ్చుకున్నాయి. అనంతరం 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడింది. పేదలకు పట్టెడన్నం లేకుండా చేస్తూ క్యాంటీన్లను మూసివేస్తూ అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. అన్నక్యాంటీన్లను మూసివేసి నిరుపేదలకు రుచికరమైన భోజనాన్ని దూరం చేశారు. ఈ నిర్ణయంపై అన్ని వర్గాల్లోనూ తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. ఈ నేపథ్యంలో అన్న క్యాంటీన్లను పునరుద్ధరిస్తామని చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. ఆ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 33 మున్సిపాలిటీల్లో ఈ నెల 15న వంద అన్నక్యాంటీన్లను ప్రారంభించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

# నల్లజర్ల పి.హెచ్.సీ ని సందర్శించిన... జిల్లా వైద్యారోగ్య శాఖ తనిఖీ బృందం!



నల్లజర్ల, జర్నలిస్ట్ ఫైల్ : నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ తనిఖీ బృందం మంగళ వారం సందర్శిం చింది. ఈ సందర్భంగా పి.హెచ్.సీ పరిధిలోని అన్ని గ్రామాల ఏ.ఎన్.ఎం లు, ఆశా కార్య కర్తలతో బృందం ప్రత్యేకించి సమావేశమైంది. గ్రామాల్లో చేస్తున్నా ఆరోగ్య సేవలు గురించి ఆరా తీస్తూ ప్రతీ ఒక్కరినీ పలు ఆరోగ్య అంశాలపై ప్రశ్నించారు. క్షేత్రస్థాయిలో అందుతున్న వైద్య సేవలు గురించి పలువురు మహిళలను, గర్భిణీ స్త్రీలను అడిగి తెలుసుకున్నారు. రక్త హీనత వున్నా కిశోర బాలికలు, గర్భిణీలకు అందుతున్న సేవల స్వయంగా పర్యవేక్షించారు. నల్లజర్ల ప్రభుత్వాసుపత్రి పరిధిలోని అన్ని గ్రామాల్లో జరుగుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాల తీరుపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ తనిఖీ బృందం సంతృప్తిని వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ కె.సంధ్యారాణి, జిల్లా డేటా మేనేజర్ ఎస్.రామకృష్ణ, ఆశా డి.సీ.ఎం ఎం.అర్జునరావు, నల్లజర్ల ప్రభుత్వాసుపత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ తెల్లం గంగాధరరావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పలివెల ప్రసాదరావు, పి.హెచ్.ఎన్ సానం రాధాకుమారి, హెచ్.వీ అన్నమ్మ, పర్యవేక్షకులు సత్యనారాయణ, వైద్య ఉద్యోగులు సంఘం నాయకులు జీ.వీ.వీ.ప్రసాద్ పాల్గొన్నారు.

# పుట్టిన ప్రతి బిడ్డకు తల్లిపాలు మొదటి టీకా...ఐసిడిఎస్ సూపర్వైజర్ జ్యోతిలక్ష్మి



నెల్లూరు ,జర్నలిస్ట్‌ఫైల్: పుట్టిన ప్రతి బిడ్డకు తల్లిపాలు మొదటి టీకాలాంటిదని ఐసిడిఎస్ సూపర్వైజర్ జ్యోతి లక్ష్మీ పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక పొదల కూరు మండలం వామిటపర్తి, ఊసపల్లి గ్రామం అంగన్‌వాడీ కేంద్రాలలో జరిగిన తల్లిపాల వారోత్సవాలలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లులకు పలు సూచనలు జారీ చేశారు.బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు అందించడం ద్వారా పిల్లలకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు.అలాగే బిడ్డకు పాలివ్వడం ద్వారా తల్లి రొమ్ము క్యాన్సర్ నుండి బయటపడే అవకాశం 100 శాతం ఉందన్నారు. బిడ్డకు పాలు పట్టే విధానం, ఎలాంటి ఆహారం తింటే బాలింతలకు పాలు సమృద్ధిగా ఉత్పత్తి అవుతాయి లాంటి సందేహాలను ఈ సందర్భంగా తల్లుల సందేహాలను నివృత్తి చేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్, ఎమ్మెస్ కే.సంగీత, అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మ , ఉష , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదానికి గుర్తై, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయిన జన సైనికుడు.



నెల్లూరు ,జర్నలిస్ట్ ఫైల్:నెల్లూరు జిల్లా ,తోటపల్లి గూడూరుకు చెందిన జనసేన పార్టీ మండల కార్యదర్శి వంగపూడి నారాయణ పాపిరెడ్డి పాలెం వద్ద ప్రమాదానికి గురికావడంతో చెన్నై నగరంలో వైద్య సేవలు తీసుకుంటూ మంగళవారం అకాల మరణానికి గురయ్యారు.ఈ విషయం తెలుసుకున్న నెల్లూరు ,ప్రకాశం ,తిరుపతి జిల్లాల జనసేన పార్టీ కోఆర్డినేటర్లు ఆయన అంత్యక్రి యలకు తమ వంతు బాధ్యతగా సహకారం అందించేందుకు ముందుకు వచ్చారు. వీరిలో నెల్లూరు జిల్లా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ కాగా,తిరుపతి, ప్రకాశం నెల్లూరు జిల్లాల జిల్లా కోఆర్డినేటర్ కోలా విజయలక్ష్మి వీరు తమ మానవత దృక్పథంతో జనసేన పార్టీ తోటపల్లి గూడూరు మండల కార్యదర్శి అయినటువంటి వంగపూడి నారాయణ ప్రమాదానికి గుర్తై,అర్ధాంతర మరణానికి ఈ సందర్భంగా వారు నారాయణ అంత్యక్రియల ఖర్చులు భరించేందుకు మానవత చాటుకున్నారు. ఈ క్రమంలో కోలా విజయలక్ష్మి, గునుకుల కిషోర్ మంగళవారం వంగపూడి నారాయణ అంత్యక్రియల్లో పాల్గొని వారి కుటుంబానికి జనసేన పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.పార్టీ పరంగా వారికి ఏ విధమైన సహాయం చేస్తామని ,కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనోధైర్యాన్ని అందించారు. వంగపూడి నారాయణ తమతో కలిసి అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొని చురుగ్గా విధులు నిర్వహించే వారిని ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సర్వేపల్లి ఇంచార్జ్ బొబ్బేపల్లి సురేష్ నాయుడు , జనసేన పార్టీ నాయకులు పోనుబోయిన ప్రసాద్ యాదవ్ , టీ పి గూడూర్ మండల గౌరవ అధ్యక్షుడు కోసూరు నారాయణ , మహిళా అధ్యక్షురాలు టీపి గూడూరు మండల జయసుధమ్మ, మండల నాయకులు పరంటయ్య ,లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కోసూరు నారాయణ మాట్లాడుతూ నారాయణ సంతాప సభ ఆదివారం పాపిరెడ్డిపాలెం గ్రామంలో నిర్వహిస్తామని , ఈ కార్యక్రమానికి జనసైనికులు, వీర మహిళలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

# ఘనంగా డాక్టర్ చినమిల్లి జన్మదిన వేడుకలు



నరసాపురం, జర్నలిస్ట్ ఫైల్ : వైద్య, విద్యా ప్రదాత డాక్టర్ చినమిల్లి సత్యనారా యణ రావు ఆదర్శనీయుడని ప్రముఖ వ్యాపారవేత్త బళ్ల మురళీ కృష్ణ అన్నారు. మంగళవారం నర్సాపురం వైఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్, లయన్స్ క్లబ్ పూర్వ గవర్నర్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ రావు (సిఎస్ఎన్) జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు, శ్రేయోభిలాషులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చినమిల్లి సత్యనారాయణరావుకు పూలతో అలంకరించిన కిరీటాన్ని బళ్ల కృష్ణ, ఆదరణ ట్రస్ట్ చైర్మెన్ బొడ్డు కృష్ణ భగవాన్ లు ధరింపజేసి గజమాలతో సత్కరించి డాక్టర్ చినమిల్లి సమాజానికి చేసిన సేవలను ప్రశంసించారు. డాక్టర్ సిఎస్ఎన్ అన్నివర్గాల ఆదరాభిమానాలు కలిగిన వారని అన్నారు. పేదల వైద్యుడిగా, విద్యా ప్రదాతగా, గొప్ప సామాజిక సేవా వేత్తగా డాక్టర్ సత్యనారాయణరావు మంచి పేరు పేరు ప్రఖ్యాతులను సొంతం చేసుకున్నారని అన్నారు. భగవంతుని ఆశీస్సులు సత్యనారాయణరావు కు ఎల్లప్పుడూ ఉండాలని వారు ఆకాంక్షించారు. నరసాపురం కల్యాణి మానసిక వికలాంగుల కేంద్రంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సుంకర రమేష్, అల్లూరి నళిని, పులపర్తి ప్రతాప్, గంటా భాస్కర్, ఐ రాజశేఖర్, రంగినీడి సుబ్బారావు తదితరులు బర్త్ డే కేకును డాక్టర్ చినమిల్లి సత్యనారాయణరావు చేతుల మీదుగా కట్ చేయించి విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. స్థానిక తెలగా కళ్యాణ మండపంలో రాయల్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జక్కం బాబ్జీ, పోలిశెట్టి గణేశ్వరరావు, కోశాధికారి అందే వేంకటకృష్ణలు డాక్టర్ చినమిల్లి సేవలను కొనియాడి ఘన సన్మానం చేశారు. వైఎన్ కళాశాలలో ఎన్ఎస్.ఎస్, ఎన్.సి.సి, లయన్స్ క్లబ్ సంస్థల ఆధ్వర్యంలో పాలకొల్లు వాలంటరీ బ్లడ్ బ్యాంక్ సహకారంతో బర్త్ డే వేడుకలు నిర్వహించి విద్యార్థులు రక్తదానం చేశారు. తదితర సంస్థల అధ్వర్యంలో ఘనంగా జరిగాయి. లయన్స్ పూర్వ గవర్నర్ మేకా శ్రీరామ్ సురేష్, జీబి మెంబర్ సుబ్బారావు, ప్రిన్సిపాల్ కనకరావు, డీన్ గంధం శ్రీరామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ వెంకటరత్నం, యాకోబు, శ్యామ్ బాబు, సోమేశ్వరి, విశ్రాంత ప్రిన్సిపాల్స్ కర్ణ వెంకటేశ్వర్లు, కొప్పర్తి అమ్మాజీ, అందే రంగారావు, అరేటి మృత్యుంజయ, ఆరోగ్య వర్షిణి నాగిడి రాంబాబు తదితరులు డాక్టర్ సత్యనారాయణరావు కి పుష్ప గుచ్ఛంతో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# భల్లూకాలతో భయం.. గ్రామాల్లోకి ఎలుగుబంట్లు



- నీళ్లు, తిండి లేక తిప్పలు
- వణికిపోతున్న జనం

**అనంతపురం ( జర్నలిస్ట్ ఫైల్ ) :** కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో ఎలుగుబంట్లు హల్చల్ చేస్తున్నా యి. గ్రామాల్లోకి చొరబడుతున్నాయి. జిల్లాలో వర్షాభావ పరిస్థితుల కారణంగా అడవుల్లో నీళ్లు, మేత కరువైంది. దీంతో రాత్రి సమయంలో నివాస ప్రాంతాల్లోకి వస్తున్నాయి. దీంతో జనం వణికిపోతున్నారు. అప్పుడప్పుడు అవి దాడులు చేస్తుండడం వల్ల గాయాలపాలవుతున్నారు.
జిల్లాలో అటవీ శాఖ చేపట్టిన చర్యల ఫలితంగా అడవులు పెరుగుతున్నాయి. అయితే గడచిన కొన్ని సంవత్సరాలుగా నిధుల లేమి కారణంగా అటవీశాఖ వన్యప్రాణుల సంరక్షణకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అడవుల్లో వాటికి ఆహారం అందించడానికి, తాగునీటి కోసం సాసర్లను నిర్మించలేకపోతున్నారు. దీంతో తాగునీటి కోసం వ్యవసాయ బోర్లు, బావుల దగ్గరికి వెళుతున్నాయి. అక్కడున్న రైతులను గాయపరుస్తున్నాయి.
తాజాగా బ్రహ్మసముద్రం మండలం వెస్ట్ కోడిపల్లి, బొబ్బర్లపల్లి గ్రామ కొండ ప్రాంతాల్లో ఎలుగుబంటి హల్చల్ చేసింది. రెండు పిల్లలను వెంట తీసుకుని వచ్చిన ఎలుగుబంటి గ్రామాల వద్దకు వచ్చింది. కొండ ప్రాంతం నుండి కిందకు దిగుతుండగా గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. వారం రోజుల్లో మూడు దపాలుగా ఎలుగుబంట్ల సంచరించడంతో భయం గుప్పెట్లో వెస్ట్ కోడిపల్లి రైతులు, గ్రామస్తులు ఉన్నారు

# హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయండి




**నెల్లూరు కలెక్టరేట్ (జర్నలిస్ట్ ఫైల్):** ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా విజయవంతం చేద్దామని నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ పిలుపునిచ్చారు. స్థానిక వి. ఆర్. సి. మైదానం నుంచి గాంధీ బొమ్మ కూడలి వరకు స్వాతంత్ర్య దినోత్సవ ర్యాలీని కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 2 నుంచి 13 వరకు జరగనున్నస్వాతంత్ర్య దినోత్సవాల్లో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలోని ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేసేలా కార్యక్రమాలను రూపొందించి పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు డాక్టర్ పెంచలయ్య, మలోల, కన్నమ నాయుడు, వెంకటయ్య, ప్రజా ప్రతినిధులు, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ శర్మద, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చైతన్య, టి పి ఆర్ ఓ ప్రసాద్, మేనేజర్ ఇనాయతుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

# పెద్దతిప్ప సముద్రం ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉద్రిక్తత




**అన్నమయ్య ( జర్నలిస్ట్ ఫైల్ ) :** పెద్దతిప్ప సముద్రం ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. తంబళ్ళపల్లి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ జయ చంద్రారెడ్డిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. జరగాల్సిన సర్వసభ్య సమావేశాన్ని తెలుగుదేశం కార్యకర్తల అడ్డుకుంటారని ముందస్తుగా ఐదు గంటలకే ఎంపీడీవో కార్యాలయంలోకి వెళ్లి వైసిపి ఎంపీటీసీ సభ్యులు తాళాలు వేసుకున్నారు. వైసిపి ప్రభుత్వంలో వీరంతా దొంగచాటున ఎంపీటీసీలయ్యారనీ, ప్రజల చేత ఎన్నుకోబడిన వారు కాదని వీరు ఎంపీటీసీ సభ్యులుగా అనర్హులని వీరందరూ వెంటనే రాజీనామా చేసి ప్రజల్లోకి వెళ్లి ప్రజల చేత ఎన్నుకోబడి మీటింగ్ ఏర్పాటు చేసుకోవాలని లేనిపక్షంలో ఈ సర్వసభ్య సమావేశాన్ని ఎప్పుడు అడ్డుకుంటామని టిడిపి శ్రేణులు హెచ్చరించారు. గత ప్రభుత్వంలో అధికార యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకొని ఎన్నికలు జరపకుండా నియోజకవర్గ వ్యాప్తంగా ఏకగ్రీవం చేసి ఎంపీటీసీలుగా ఎన్నుకోవడం పై టిడిపి శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గో బ్యాక్ ఎంపీటీసీ అంటూ నినాదాలు చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు భారీగా మోహరించారు.

# చీరాలలో ముస్లిం నాయకులు-యువకుల ఆందోళన



**బాపట్ల (జర్నలిస్ట్ ఫైల్):** విద్యార్థి హత్య కేసుకు సంబంధించి నిందితులను పోలీసులు వెంటనే అరెస్ట్ చేయాలని కోరుతూ చీరాల గడియారం సెంటర్లో ముస్లిం నాయకులు, యువకులు ఆందోళన చేపట్టారు. నిరసన చోటుకు పోలీసులు చేరుకొని ఆందోళనను విరమించాలని చెప్పారు.

# శ్రీమతికి చీరలు కొన్న శ్రీవారు



**విజయవాడ, అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు తన సతీమణి భువనేశ్వరి కోసం చీరలు కొన్నారు. చేనేత దినోత్సవంలో పాల్గొన్న ఆయన అక్కడి ఏర్పాటు చేసిన స్టాల్స్ వద్ద స్వయంగా రెండు చీరలు కొనుగోలు చేశారు. చీరల ప్రత్యేకత గురించి అడిగి తెలుసుకొని మరీ ఈ చీరలను తీసుకున్నారు. వెంకటగిరి చీర, ఉప్పాడ జాందాని చీరలను సీఎం తీసుకున్నారు. కాగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చి తమ ఉత్పత్తులతో స్టాల్ ఏర్పాటు చేసిన నేతన్నలతో ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా మాట్లాడారు. వారి సాధకబాధకాలను అడిగి తెలుసుకున్నారు. స్టాళ్లలో ఉత్పత్తులను పరిశీలించారు. ఉత్పత్తుల గురించి వివరాలు తెలుసుకున్నారు.

**చేనేత ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన సీఎం చంద్రబాబు**

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు చేనేత కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడలోని స్టెల్లా ఆడిటోరియంలో చేనేత ఎగ్జిబిషన్‌ని ఆయన ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా చేనేత కార్మికులు నేసిన చీరలను ఎగ్జిబిషన్ సెంటర్‌లో ప్రదర్శించనున్నారు. స్టాల్ ప్రారంభించిన అనంతరం ప్రతి స్టాల్ వద్దకు వెళ్లి చేనేత దుస్తులను చంద్రబాబు స్వయంగా పరిశీలించారు. సుమారు 80కి పైగా స్టాల్స్‌లో చేనేత దుస్తులు ఉంచారు. చేనేత కార్మికులను ప్రోత్సహించే దిశగా ఈ ఎగ్జిబిషన్‌ని ప్రారంభించినట్లుగా సీఎం తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే బోండా ఉమా, పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, విజయవాడ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, హ్యాండ్లూమ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సునీత, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ గుమ్మళ్ల సృజన, పురపాలక కమిషనర్ ధ్యాన చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టు పార్టీలపై మరో ఏడాది నిషేధం : మంత్రి కొలుసు పార్దసారధి




**అమరావతి, ( జర్నలిస్ట్ ఫైల్ ) :** మావోయిస్టు పార్టీలపై మరో ఏడాది నిషేధం పొడిగిస్తూ కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి కొలుసు పార్దసారధి తెలిపారు. కేబినెట్ భేటీ అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం జారీ చేసిన 217, 144 జీవోలను రద్దు చేశామన్నారు. మత్స్యకారులకు నష్టం చేసేలా గత ప్రభుత్వం జీవో జారీలు చేసిందని.. గ్రామాల్లో చెరువులను.. కుంటలను బహిరంగ వేలం వేయాలని గత ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మత్స్యకారుల సంక్షేమం, జీవన ప్రమాణాలు పెంచడం, మత్స్య సంపద పెంచే అంశంపై అధ్యయనం చేయాలని కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఏపీలో జనాభా సంఖ్య రోజు రోజుకూ తగ్గుతోందన్నారు. జాతీయ సగటుతో పోల్చినా ఏపీలో జనాభా సంఖ్య తక్కువగానే ఉందన్నారు. యువత తగ్గిపోతోందన్న సర్వేలు వస్తున్నాయన్నారు. ఇద్దరి పిల్లలకంటే ఎక్కువ మంది ఉంటే పోటీ చేయకూడదని స్థానిక సంస్థల్లో నిబంధన ఉందని.. ఇలాంటి నిబంధనలను రద్దు చేస్తూ బిల్లుకు ఆమోదం తెలిపామన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో జనాభా పెరుగదల అవసరమని చెప్పుకొచ్చారు. పిల్లల సంఖ్యపై నిషేధాలు ఉండకూడదని కేబినెట్ భావిస్తోందని మంత్రి వెల్లడించారు.

అక్టోబర్ నుంచి ఎక్సైజ్ కొత్త పాలసీ..

కొత్త వైద్య కళాశాలల్లో అదనంగా 380 పోస్టులకు ఆమోదం తెలిపామన్నారు. సున్నిపెంట పంచాయతీకి ఇచ్చిన 208.74 భూమిని రద్దు చేశామని తెలిపారు. ఆ భూమిని ఆక్రమించుకునే ప్రయత్నం చేశారన్నారు. శ్రీశైలం దేవస్థానం మాస్టర్ ప్లాన్ కోసం వినియోగించుకుంటామని తెలిపారు. ఎక్సైజ్ శాఖపై మంత్రి వర్గ సమావేశంలో చర్చించామన్నారు. ఎక్సైజ్ శాఖను ఏకీకృత పర్యవేక్షణకు నిర్ణయం తీసుకున్నామన్నారు. మెరుగైన ఎక్సైజ్ పాలసీన రూపొందిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం సరఫరా చేసిన మద్యం వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతిన్నదన్నారు. ఇకపై ప్రముఖ బ్రాండ్లను ఏపీ మార్కెట్టులోకి తెస్తామన్నారు. అక్టోబర్ నుంచి కొత్త ఎక్సైజ్ పాలసీ అమలు చేయనున్నట్లు తెలపారు. మద్యం ధరలు తగ్గిస్తామన్నారు. గత ప్రభుత్వ మద్యం విధానాల వల్ల రూ. 18 వేల కోట్ల మేర నష్టం వాటిల్లిందన్నారు. మద్యం ఉత్పత్తి నుంచి అమ్మకాల వరకు గత ప్రభుత్వం గుత్తాధిపత్యం ఉండేలా విధానాన్ని రూపొందించిందని మంత్రి వర్గం అభిప్రాయపడిందన్నారు. 22-ఏ ఫ్రీ హోల్డ్ చేసి గత ప్రభుత్వం దోపిడీ చేసిందన్నారు. భూ సమస్యల పరిష్కారానికి త్వరలో రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వివాదంలో ఉన్న రిజిస్ట్రేషన్ల పునః పరిశీలన చేయాలని నిర్ణయించామన్నారు. ఇప్పటి వరకు 25 వేల ఎకరాలు రిజిస్ట్రేషన్లు చేశారన్నారు. మూడు నెలల పాటు అసైన్డ్, 22-ఏ రిజిస్ట్రేషన్లు విచారణ చేపడతామని తెలిపారు. మూడు నెలల పాటు విచారణ పూర్తయ్యేంత వరకు 22-ఏ భూముల రిజిస్ట్రేషన్లు నిలిపేస్తామని స్పష్టం చేశారు. రాజముద్రతో కూడిన పట్టాదారు పాసులు ఇస్తామన్నారు. సర్వే రాళ్లపై వేసిన జగన్ బొమ్మలను చెరిపేయాలని నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పార్థసారధి వెల్లడించారు.

# రాష్ట్ర రహదారులపై టోల్ ఛార్జీల ప్రతిపాదనను విరమించుకోవాలి : సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ




**విజయవాడ( జర్నలిస్ట్ ఫైల్ ) :** రాష్ట్ర రహదారులపై ప్రయాణించే వాహనాలకు టోల్ ఛార్జీ వసూలు చేయాలన్న ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ కోరింది. దీనికి సంబంధించి బుధవారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రకటనను విడుదల చేశారు. పిపిపి పేరుతో రోడ్లపై టోల్ టాక్స్ వసూలుకు సన్నాహాలు చేయాలని కలెక్టర్ల సమావేశంలో అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశించినట్లు మీడియాలో వార్తలు వచ్చాయని, తక్షణం వెయ్యి కిలోమీటర్ల పరిధిలో టోల్ వసూలు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆ సమావేశంలో నిర్ణయించారని భవిష్యత్తులో మొత్తం 12,650 కిలోమీటర్ల రాష్ట్ర రహదారులపై టోల్ వసూలు చేసే ప్రమాదముందని తెలిపారు. రోడ్లను అభివృద్ధి చేయడం, వాటిని సక్రమంగా నిర్వహించడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత అని చెప్పారు. వాహనాల రిజిస్ట్రేషన్ సమయంలో లైఫ్ టాక్స్, డీజిల్, పెట్రోల్ పై రోడ్డు సెస్సు తదితర రూపాలలో ప్రభుత్వాలకు ఆదాయం సమకూరుతోందని, ఆ సొమ్ము ఆయా వాహన యజమానులు, వాటిలో ప్రయాణించేవారు ఇప్పటికే భరిస్తున్నారని వివరించారు. ఇప్పటికే జాతీయ రహదారులన్నింటిలో టోల్ టాక్సుల భారంతో రవాణా రంగం నష్టాలల్లో ఉన్నదన్నారు. పిపిపిల పేరిట రాష్ట్ర రహదారుల్లో ప్రతిపాదిక టోల్‌టాక్సులు మోయలేని భారాలుగా మారి రాష్ట్ర రవాణా రంగాన్ని నష్టాలపాలు చేస్తాయని తెలిపారు. ప్రజలపై అదనపు భారం పడుతుందని కాబట్టి రాష్ట్ర రహదారులపై టోల్‌టాక్సు ప్రతిపాదన విరమించుకోవాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నదని శ్రీనివాసరావు పేర్కొన్నారు.

# ఎడతెరిపి లేని వర్షం.. సీఎం చంద్రబాబు చీరాల పర్యటన రద్దు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ఏపీ సీఎం చంద్రబాబు చీరాల పర్యటన రద్దయింది. చేనేత దినోత్సవంలో పాల్గొనేందుకు బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు చంద్రబాబు చీరాల వెళ్లాల్సి ఉంది. ఎడతెరిపి లేని వర్షం కారణంగా పర్యటనను సీఎం రద్దు చేసుకున్నారు. విజయవాడలో నిర్వహించే చేనేత దినోత్సవంలో చంద్రబాబు పాల్గొన్నారు.

# హోంమంత్రి అనితను కలిసిన వివేకా కుమార్తె సునీత



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** వైఎస్ వివేకా కుమార్తె సునీత ఏపీ హోంమంత్రి అనితను కలిశారు. తన తండ్రి హత్య కేసులో జరిగిన అన్యాయాన్ని ఆమె మంత్రికి వివరించారు. వివేకా హత్య తదనంతర పరిణామాలను హోంమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గత ప్రభుత్వ హయాంలో స్థానిక పోలీసులు హంతకులకు అండగా నిలిచారని ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. విచారణ సమయంలో కేసును నీరుగార్చేలా వ్యవహరించారని పేర్కొన్నారు. సీబీఐ అధికారులపై తప్పుడు కేసుతో పాటు సాక్షులను బెదిరించారని సునీత హోంమంత్రికి వివరించారు. ఈకేసు సీబీఐ విచారణలో ఉన్నందున ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం ఉంటుందని మంత్రి అనిత తెలిపారు. దోషులకు శిక్ష పడేలా చూసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని చెప్పారు. తప్పు చేసిన పోలీసులను వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు.

# ప్రకాశం బ్యారేజీకి పోటెత్తిన వరద..70 గేట్లు ఎత్తి నీటి విడుదల




**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టు గేట్లు ఎత్తివేయడంతో ప్రకాశం బ్యారేజీకి వరద పోటెత్తుతోంది. దీంతో బ్యారేజీలోని మొత్తం 70 గేట్లను ఎత్తి 73,227 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మరోవైపు కాల్వల ద్వారా 13,477 క్యూసెక్కుల నీటిని విడిచిపెడుతున్నారు. సాయంత్రం లేదా రాత్రికి లక్షన్నర క్యూసెక్కులకు చేరుకునే అవకాశముందని అధికారులు తెలిపారు. దీంతో లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు.

# జగన్ పిటిషన్‌పై విచారణ వాయిదా

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. తనకు భద్రత కుదింపుపై ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై కోర్టు విచారణ చేపట్టింది. జగన్‌కు భద్రత ఇవ్వడం లేదని, అలాగే బుల్లెట్ ప్రూఫ్ వాహనం కూడా పని చేయడం లేదని వైసీపీ అధినేత తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. జగన్‌కు సెక్యూరిటీని తగ్గించారని జెడ్ ప్లస్ కేటగిరీ భద్రతను కొనసాగించాలని కోరారు. అయితే జగన్‌కు నిబంధనల ప్రకారం భద్రత ఇస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. జామర్ ఏర్పాటుపై మధ్యాహ్నం లోపు స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

# విజయవాడలో వైసీపీకి గట్టి ఎదురుదెబ్బ



**విజయవాడ( జర్నలిస్ట్ ఫైల్ ) :** అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో ఘోర ఓటమితో పరాభవం మూటగట్టుకున్న వైసీపీకి మరో షాక్ తగలబోతోందా. అంటే అవుననే సంకేతాలిస్తున్నాయి తాజా పరిణామాలు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీలో ఉన్న నేతలు, కార్యకర్తలు ఇతర పార్టీల్లోకి రావడానికి క్యూ కడుతున్నారు. ఆ పార్టీపై ప్రజల్లో విపరీతంగా పెరిగిన అసహనంతో అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవడంతో.. మరో పదేళ్ల వరకు వైసీపీకి రాజకీయ భవిష్యత్తు ఉండదనే అంచనాల నడుమ నేతలు, కార్యకర్తలు తలోదిక్కున చూస్తున్నారు. ఈ క్రమంలోనే విజయవాడలో వైసీపీ భారీ షాక్ తగలబోతోంది. ఆ పార్టీకి చెందిన 8 మంది కార్పొరేటర్లు బీజేపీ ఎమ్మెల్యే సుజనా చౌదరిని బుధవారం ఆయన నివాసంలో కలిశారు. మర్యాదపూర్వకంగానే ఆయన్ని కలిశామంటున్న కార్పొరేటర్లు కూటమి ప్రభుత్వంలోకి రావడానికి ఆసక్తి చూపిస్తున్నట్లు తెలుస్తోంది.
వీరంతా కలిసి త్వరలో కూటమిలోని వివిధ పార్టీల్లో చేరనున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి లైన్ క్లియర్ చేసుకుంటున్నారు. ఎనిమిది మంది కార్పొరేటర్లు సుజనాను కలవడంపై వైసీపీ నేతల్లో తీవ్ర అంతర్మథనం ఏర్పడింది. అప్రమత్తమైన మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు కార్పొరేటర్లను బుజ్జగించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.
అయితే బీజేపీ.. టీడీపీ అధిష్టానాన్ని సంప్రదించి.. ఒకటి రెండు రోజుల్లో కూటమి ప్రభుత్వంలోకి వారిని ఆహ్వానించే అవకాశం ఉంది. బీజేపీ ఎమ్మెల్యేను కలిసిన వారిలో అప్పాజీ, అత్తులూరి ఆదిలక్ష్మీ, మురిపిళ్ల రాజేశ్, గుడివాడ నరేంద్ర, హర్షత్, మైలవరపు రత్నకుమారి, మైలవరపు మాదురి, ఉమ్మడి శెట్టి బహుదూర్ ఉన్నారు.

**దెబ్బ మీద దెబ్బ..**

ఇటీవల జరిగిన ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఘోర ఓటమి తర్వాత ముఖ్య నేతలు ఒక్కొక్కరుగా ఆ పార్టీని వీడుతున్నారు. ఇప్పటికే ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు పార్టీని వీడగా ఇప్పుడు ఆ లిస్టులో పెండెం దొరబాబు చేరారు. 2024ఎన్నికల్లో తనకు కాదని పిఠాపురం నియోజకవర్గం సీటు వంగా గీతకు ఇవ్వడంపై ఆయన అసంతృప్తిగా ఉన్నారు. వంగా గీతపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ 70వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందిన విషయం తెలిసిందే.అయితే పార్టీలో తనకు సరైన గుర్తింపు లేకపోవడంతోనే వైసీపీకి రాజీనామా చేసినట్లు దొరబాబు వెల్లడించారు. మరో వైసీపీ ముఖ్య నేత మాజీ మంత్రి శిద్ధా రాఘవరావు ఇప్పటికే వైసీపీకి రాజీనామా చేశారు. ఆయన టీడీపీలో చేరే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. 2014లో టీడీపీ తరఫున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచిన శిద్ధా రాఘవరావు మంత్రి పదవి కూడా దక్కించుకున్నారు. తర్వాత 2019లో ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం వైసీపీలో చేరి 2024ఎన్నికల్లో ఎమ్మెల్యే సీటు ఆశించారు.
మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆయనకు మొండి చేయి చూపించడంతో ఇటీవల రాజీనామా చేశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మద్దాలి గిరి, పొన్నూరు మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య సైతం ఇటీవల వైసీపీకి గుడ్ బై చెప్పారు. 2019లో ఎమ్మెల్యేగా గెలిచిన మద్దాలి గిరి వైసీపీకి మద్దతు తెలిపారు. 2014 ఎన్నికల్లో జగన్ ఆయనకు ఎమ్మెల్యే సీటు కేటాయించలేదు. మనస్తాపం చెంది పార్టీని వీడారు. ఇలా వరుసగా నేతలు వైసీపీని వీడుతుండటానికి బలమైన కారణం ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీని ప్రజలు శాశ్వతంగా వద్దనుకున్నారు. ప్రజల్లో వైసీపీపై పుట్టిన విసుగే ఎన్నికల్లో ఆ పార్టీని11 స్థానాలకు పరిమితం చేసిందనే రాజకీయ నిపుణుల మాట. ఆ పార్టీకి రాష్ట్రంలో భవిష్యత్తు లేదని భావిస్తున్న నేతలు కూటమి పార్టీల్లోకి క్యూ కడుతున్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467